www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Hyderabad - Vijaywada - Delhi - Bengaluru
సోమవారం 21, జూలై, 2025 | పేజీలు :12

# శక్తిస్వరూపిణి దీవెనలతో
# మెరుస్తున్న భాగ్యనగరం

- హైదరాబాద్ వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో బోనాల జాతర
- బోనాల సందడితో శోభాయమానంగా మారిన పట్నం



**టీపీఎన్, తెలంగాణ:** హైదరాబాద్ భక్తి భావనలతో నిండి పోయింది. శక్తిస్వరూపిణి అమ్మవారి దీవెనల కోసం భక్తులు ఆలయాలవైపు తరలివెళ్లారు. భక్తుల సందడితో ఆలయాలు కిటకిటలాడాయి. పూర్వీకుల సంప్రదాయాలకు అనుగుణంగా, ఒక్కో బోనం ఓ మొక్కురాలిగా అమ్మవారికి అర్పిస్తూ భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. పట్టణ వీధుల్లో డప్పుల చప్పుళ్లు, జానపద శబ్దాల మధ్య అమ్మవారిని దర్శించుకుని, బోనాలు సమర్పించారు. భక్తుల ముఖాల్లో కనిపించిన సంతృప్తి ఆధ్యాత్మిక అనుభూతిని ప్రతిబింబించింది. శ్రీమహంకాళి, సింహవాహిని, పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. ఆలయాల వద్ద పోలీస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భద్రత, తాగునీరు, శుభ్రత వంటి ఏర్పాట్లు మెరుగ్గా కొనసాగుతున్నాయి. బోనాల ద్వారా నగరం ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచింది. సంప్రదాయాల పట్ల గౌరవం, అమ్మవారి దయపై నమ్మకాన్ని చాటే పండుగగా బోనాలు కొనసాగుతున్నాయి.



## చార్మినార్‌లో భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు

**టీపీఎన్, హైదరాబాద్:** చార్మినార్‌లో భాగ్యలక్ష్మీ అమ్మవారిని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొమటిరెడ్డి వెంకటరెడ్డిలు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించి రాష్ట్ర ప్రజలకు శక్తి, ధైర్యం ఇవ్వాలని ప్రార్థించామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా అమ్మవారి ఆశీస్సులు ఉండాలన్నారు.గత వారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాలు విజయవంతంగా ముగిశాయని తెలిపారు. అలాగే బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణం కూడా ఘనంగా జరిగిందన్నారు. ఆదివారం జంట నగరాల్లోని పలు ఆలయాల్లో బోనాలు ఘనంగా జరిగాయన్నారు.

## పార్టీ వదలొచ్చు.. కానీ ధర్మం మారదు..!

- గోషామహల్ బీజేపీ అడ్డా.. పార్టీ చెప్పిందే తుది మాట
- అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాను
- హైకమాండ్ రాజీనామ చేయమంటే చేస్తాను
- నేను ఎక్కడికీ వెళ్లను.. ఎవరితోనూ కలవను
- రాజాసింగ్ మరోసారి షాకింగ్ కామెంట్స్



**టీపీఎన్, హైదరాబాద్:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ లో చేరబోతున్నారనే ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. ఎంఐఎంతో దోస్తీ ఉన్న కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లనని అసలు ఏ పార్టీలో చేరను అని స్పష్టం చేశారు. బీజేపీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. ఎమ్మెల్యే పదవికీ బీజేపీ రాజీనామా చేయమంటే చేస్తానని తెలిపారు. గోషామహల్‌లో ఉప ఎన్నిక వస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని రాజాసింగ్ చెప్పుకొచ్చారు. ఈరోజు ఉదయం లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారిని ఎమ్మెల్యే రాజాసింగ్ దర్శించుకున్నారు. సింహవాహిని మహంకాళి అమ్మవారిని రాజాసింగ్ దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజాసింగ్ మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనం అనంతరం ఓ మంత్రితో మాట్లాడానని చెప్పారు. మోడల్ గోశాల కట్టడానికి మంత్రి సహకారం కావాలని కోరినట్లు చెప్పారు. ఏ పార్టీలో ఉన్నా అందరి లక్ష్యం ఒకటే, ప్రజలకు మంచి చేయడమన్నారు. సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని వైభవంగా కడతామని గత ప్రభుత్వాలు రాజకీయం చేశాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా అమ్మవారి గుడిని వైభవంగా కట్టాలని కోరారు. తాగి ఆడే బోనాలని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బోనాల సంస్కృతి నాశనం చేయడానికి చాలా కాలంగా కుట్ర జరుగుతోంది' అని అన్నారు.



## దుష్ట శక్తుల కదలికలున్నాయి..
## రాములమ్మ పొలిటికల్ పంచ్

**టీపీఎన్, హైదరాబాద్:** తెలంగాణ దోపిడీకి మళ్లీ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్సీ విజయశాంతి వీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోకి కొన్ని దుష్టశక్తులు అడుగుపెట్టాలనే ఉద్దేశంతో కదులుతున్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ అనేది పోరాటాలతో వచ్చిందని గుర్తు చేశారు. ప్రజలంతా ధర్మబాటలో నడవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బోరబండలో ఆదివారం జరిగిన పోచమ్మ బోనాల ఉత్సవాల్లో విజయశాంతి పాల్గొన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన విజయశాంతి.... తెలంగాణ అనేది అక్షయపాత్ర లాంటిదని చెప్పారు. దాన్ని దోచుకోవాలన్న కుట్రలు మళ్లీ కనిపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజల పార్టీ అని.. దుష్టశక్తులు ఏమన్నా పట్టించుకోవద్దని సూచించారు. తెలంగాణ ప్రజల గుండెల్లో ఉందని చెప్పారు. ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కాంగ్రెస్ పార్టీ నిరంతరం కట్టుబడి ఉంటుందని విజయశాంతి స్పష్టం చేశారు.




## మా మీద హిందీని రుద్దవద్దు
### భారత్‌కి ఒక్క జాతీయ భాష అవసరం లేదు

- భారత్ భిన్న సంస్కృతుల సమ్మేళనం
- దేశంలో అనేక అధికారిక భాషలున్నాయి
- హిందీ కోసం రూ.50 కోట్లు.. ఇతర భాషలకు నిల్
- జైపూర్‌లో విద్యార్థుల సంభాషణలో కేటీఆర్ కామెంట్స్

**టీపీఎన్, తెలంగాణ:** దేశంలో జాతీయ భాషపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్‌కు ఏకైక జాతీయ భాష అవసరం లేదన్నారు. తమ మీద హిందీని రుద్దే ప్రయత్నాలు చేయవద్దని కేంద్రానికి రిక్వెస్ట్ చేశారు. జైపూర్‌లో జరిగిన ఓ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్ విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. హిందీ జాతీయ భాష కాదని స్పష్టంగా చెప్పాలన్నారు. దేశంలో ఎన్నో అధికారిక భాషలు ఉన్నాయని చెప్పారు. హిందీ భాష కోసం బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయిస్తే, తెలుగు, బెంగాలీ, తమిళం వంటి భాషల అభివృద్ధికి ఎందుకు నిధులు ఇవ్వరని ప్రశ్నించారు. భారతదేశం భిన్న భాషల, సంస్కృతుల సమ్మేళనమని అభివర్ణించారు. తాము ఇతర రాష్ట్రాలవారిపై తెలుగు భాషను రుద్దమని.. తమ మీద హిందీని ఎందుకు రుద్దుతున్నారని వ్యాఖ్యానించారు. దేశంలో అత్యధికంగా మాట్లాడే భాష హిందీ ఉండవచ్చని.... కానీ దాన్ని నేర్చుకోవాలా వద్దా అనేది వ్యక్తిగత విషయమని వదిలేయాలన్నారు. హిందీ భాషపై ప్రేమ ఉందంటే నేర్చుకోవచ్చు.. బలవంతం చేయకూడదని వెల్లడించారు.



## ఎవరైనా రావొచ్చు.. ఆల్వేస్ వెల్కమ్

**టీపీఎన్, తెలంగాణ:** జాతీయ భాషపై చర్చలు ముదురుతున్న వేళ సీఎం రేవంత్‌రెడ్డి ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేశారు. మహారాష్ట్రాలో మరాఠీ, కర్ణాటకలో కన్నడ, తమిళనాడులో తమిళం నేర్చుకోవాలని ఆయా ప్రాంతాల్లో ఇతర భాషలు మాట్లాడే వారిపై ఆందోళనకు దిగుతున్నారు. భాషల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణకు భాష, కులం, మతంతో సంబంధం లేకుండా ఎవరైనా రావొచ్చు అనే సంకేతాలను రేవంత్ రెడ్డి ఇస్తున్నట్లు రాసుకొచ్చారు. మరోవైపు తెలంగాణ రైజింగ్2047 పేరుతో వివిధ భాషల లిపితో కూడిన మ్యాప్ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో తెలుగు హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, తమిళం, కన్నడ, ఫ్రెంచ్, స్పానిష్, జపనీస్ వంటి వివిధ దేశాలలోని భాషలతో 'స్వాగతం' అని రాసి ఉంది.'హైదరాబాద్ అందరినీ ఆహ్వానిస్తోంది'అని పోస్టర్ టైటిల్‌తో పాటు రేవంత్ రెడ్డి ఫోటోతో పోస్టర్ విడుదలైంది.

## తెలంగాణ బీజేపీలో ముసలం.. కమలం పార్టీలో కలహాలు

- బీజేపీలో బండి వర్సెస్ ఈటెల
- బండి సంజయ్‌పై ఈటెల పరోక్ష విమర్శలు
- సోషల్ మీడియాలో తప్పడు ప్రచారం హైకమాండ్‌కు ఫిర్యాదు చేస్తానని ప్రకటన
- ఈటల వాఖ్యలు బీజేపీలో తీవ్ర కలకలం



• మిగతా3లో

## ఖిల్లా మైసమ్మ అమ్మవారికి సీతక్క పట్టు వస్త్రాల సమర్పణ



• మిగతా2లో

## బోనాల పండుగకు రూ.20 కోట్లతో ఏర్పాట్లు



## లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం భట్టి



**టీపీఎన్, హైదరాబాద్:** బోనాల పండుగ తెలంగాణ రాష్ట్ర ఆత్మ. ఈ పండుగలో భాగంగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... బోనాలు అంటే తెలంగాణ సంస్కృతి అని, ఈ సంస్కృతిని అనాదిగా భక్తులు ఆచరిస్తూ వస్తున్నారని తెలిపారు. గోల్కొండలో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు సికింద్రాబాద్, లాల్‌దర్వాజా వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయని చెప్పారు.రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1,290 కోట్లు కామన్ గుడ్ ఫండ్ నుంచి విడుదల చేసినట్టు భట్టి తెలిపారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరంలో బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రూ.20 కోట్ల ప్రత్యేక నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం పకడ్బందీగా పనిచేస్తోందన్నారు.ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయని.. భక్తులు, అధికారులకు అభినందనలు తెలిపారు. మహంకాళి అమ్మవారి చల్లని దృష్టితో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. సమాజం క్షేమంగా ఉండాలని పూజల సందర్భంగా ప్రత్యేకంగా ప్రార్థించినట్టు చెప్పారు. భవిష్యత్తులో లాల్‌దర్వాజా మహంకాళి ఆలయ పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని భట్టి స్పష్టం చేశారు.



# బోనాలు ఉత్సవం కాదు.. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

**టీపీఎన్, తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత చూపుతూ బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ.20 కోట్లు కేటాయించిందని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ నిధులను హైదరాబాద్ నగరంలోని 2,783 ఆలయాలకు చెక్కుల రూపంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇది కేవలం ప్రకటన మాత్రమే కాకుండా, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వానికి సంస్కృతి పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనమని అన్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం హరిబౌలీలోని చారిత్రాత్మక అక్కన్న మాదన్న ఆలయంలో శ్రీధర్‌బాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బోనాలు ఒక ఉత్సవంగా కాదు, మన తెలంగాణ జీవన విధానం, సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు.బోనాల పదం మన మట్టివాసనను, అమ్మ ప్రేమను, భక్తి శ్రద్ధను ప్రతిబింబిస్తుందని చెప్పారు. గడపగడపనూ వెలసే బోనాల సంబురం, డప్పుల మోతలో ప్రతిధ్వనించే మన చరిత్ర, బోనాల్లో కనిపించే భక్తి అంతా కలిసి మన తెలంగాణ ప్రజల ఉనికికి అర్థం చేకూరుస్తాయని అభిప్రాయపడ్డారు. హరిబౌలిలోని అక్కన్న మాదన్న ఆలయం కేవలం దేవాలయం మాత్రమే కాక, హైదరాబాద్ చరిత్రకు, ఆధ్యాత్మికతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఆలయాన్ని సందర్శించటం తనకు లభించిన అదృష్టంగా భావించారు. అమ్మవారి దీవెనలతో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణను అన్ని రంగాల్లో, ముఖ్యంగా ఐటీ, పరిశ్రమల రంగాల్లో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల సంప్రదాయాలను పరిరక్షించడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుండాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి మార్గంలో సాగుతుందని వెల్లడించారు.



# అమ్మవారికి ప్రత్యేక పూజలు

**టీపీఎన్, తెలంగాణ:** లాల్‌దర్వాజ బోనాల ఉత్సవాల్లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కన్న మాదన్న ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో పాల్గొనడానికి వచ్చిన మహేష్‌గౌడ్‌కు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బోనాల సందర్భంగా పోతారాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుల దున్నపోతులు, బ్యాండ్ మేళాలు ఉత్సవాన్ని ఉత్సాహభరితంగా మార్చాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.



## ఖిల్ల మైసమ్మ అమ్మవారికి సీతక్క పట్టు వస్త్రాల సమర్పణ

**టీపీఎన్, రంగారెడ్డి:** మహేశ్వరం నియోజకవర్గంలోని ఖిల్ల మైసమ్మ అమ్మవారికి మంత్రి సీతక్క పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ దేవాలయం మూడు శతాబ్దాల చరిత్ర కలిగి ఉండటంతో, ఇక్కడ అమ్మవారికి వస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి అన్నారు. అమ్మవారి దీవెనలతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, పాడిపంటలతో జీవించాలని కోరుకున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన కొనసాగించేందుకు తల్లి మరింత శక్తిని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరపున బోనాల పండుగను అద్భుతంగా నిర్వహించాయని తెలిపారు. ఖిల్ల మైసమ్మ ఆలయం అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని వెల్లడించారు. గత ఏడాదిలో కూడా తాను అమ్మవారికి వస్త్రాలు సమర్పించినట్లు సీతక్క గుర్తుచేశారు.



## సీఎంను కలిసిన దుల్కర్ సల్మాన్

**టీపీఎన్, తెలంగాణ:** సీఎం రేవంత్‌రెడ్డిని సినీనటుడు దుల్కర్ సల్మాన్, నిర్మాతలు స్వప్నా దత్, చెరుకూరి సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో తమ తాజా చిత్రాల గురించి సీఎంకు వివరించినట్లు సమాచారం. 'మహానటి', 'సీతారామం', 'లక్కీ భాస్కర్' వంటి హిట్‌లతో తెలుగులోనూ పేరు తెచ్చుకున్న దుల్కర్ ప్రస్తుతం 'కాంత', 'ఆకాశంలో ఒక తార' చిత్రాల్లో నటిస్తున్నారు.



## బోనాల జాతర విజయవంతం : సీఎం రేవంత్ ప్రశంసలు

**టీపీఎన్, హైదరాబాద్:** చారిత్రాత్మక గోల్కొండలో జగదాంబిక ఎల్లమ్మ తల్లికి తొలి బోనం సమర్పణతో మొదలైన బోనాల జాతర విజయవంతంగా ముగిసింది. నెల రోజుల పాటు కొనసాగిన ఈ ఆధ్యాత్మిక వేడుకలు అన్ని శాఖల సమన్వయంతో ప్రశాంతంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బోనాల పండుగ తెలంగాణ ఆధ్యాత్మిక జీవనశైలికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రకృతితో మమేకమైన వ్యవసాయ ఆధారిత సమాజ తాత్వికత, సమూహబద్ధ భక్తిశ్రద్ధ బోనాల రూపంలో ప్రపంచానికి ఆవిష్కృతమవుతుందన్నారు. తెలంగాణ సాంప్రదాయానికి అద్దంపట్టే ఈ జాతర రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ పెంచిందని అభిప్రాయపడ్డారు. గోల్కొండలో తొలి బోనం సమర్పణతో మొదలైన ఈ పండుగ లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారికి బోనం సమర్పణతో ఘట్టాంతం అయినట్లు చెప్పారు. బోనాల ఉత్సవాల విజయవంతానికి అహర్నిశలు శ్రమించిన దేవాదాయ శాఖతో పాటు అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి ముఖ్యమంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# పాత ఫార్ములాలోనే బీఆర్ఎస్..
# సెంటిమెంట్ అస్త్రం పనిచేస్తుందా..?

అధికారం. రాజకీయాల్లో ఇదే ఏకైక లక్ష్యం. పార్టీ ఏదైనా, లీడర్ ఎవరైనా పవర్ కోసం ఎలాంటి పొజిషన్ కైనా వెళ్లడం రాజకీయ నాయకుల లక్షణం. అయితే వ్యక్తిగత ఛరిష్మాతో నెట్టుకొస్తారు. లేదంటే మాత్రం సెంటిమెంట్ రెచ్చగొడతారు. పాలిటిక్స్ లో మొదటిదానికంటే.. రెండోదే బాగా వర్కవుట్ అవుతుంది. ప్రస్తుత బీఆర్ఎస్.. గతంలో టీఆర్ఎస్ ను అధికారంలోకి తెచ్చిన ప్రధాన అస్త్రం సెంటిమెంటే..! తెలంగాణ సెంటిమెంట్ తో ప్రత్యక రాష్ట్రాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించిన కేసీఆర్ అండ్ కో.. వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. మూడోసారి సెంటిమెంట్ వర్కవుట్ కాలేదు. దీంతో ఓటమి పాలవక తప్పలేదు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఢీ అంటే ఢీ అనేలా పోరాడుతున్నా.. ఆ పార్టీని ఓడించేంత స్థాయిలో బీఆర్ఎస్ పోరాటం లేదనేది అర్థమవుతోంది. ఇందుకు ప్రధాన కారణం అవినీతి, కుటుంబ పాలన. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి, పదవులన్నీ తన కుటుంబ సభ్యులకే అప్పజెప్పడం వంటివి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చాయి. ఇదిలా ఉంటే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర పూర్తయింది. ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయగలిగే అస్త్రం గానీ, కారణంగానీ బీఆర్ఎస్ కు దొరకలేదనే చెప్పాలి. పైపెచ్చు కాళేశ్వరం రూపంలో పెద్ద బండ బీఆర్ఎస్ నెత్తిన పడింది. దీనికి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, ఫామ్ హౌస్ పాలన అదనం. దీంతో మళ్లీ అధికారంలోకి రావాలన్నా, ప్రజల్లో ఆదరణ దక్కాలన్నా మళ్లీ సెంటిమెంట్ అస్త్రమే బెటర్ అని కేసీఆర్ తో పాటు బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. అందుకే సెంటిమెంట్ అస్త్రానికి బీఆర్ఎస్ పదును పెడుతోందనే మాట బలంగా వినిపిస్తోంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీ సీఎం చంద్రబాబుకు శిష్యుడు అనే పేరుంది. దీన్ని అదునుగా తీసుకొని తెలంగాణను మళ్లీ ఆంధ్రోళ్ల చేతుల్లో పెడుతున్నారనే ఆరోపణ బీఆర్ఎస్ ఇప్పటికే చేసింది. అంతేకాదు రేవంత్ ను చంద్రబాబే వెనకుండి నడిపిస్తూ తెలంగాణ ప్రయోజనాలకు గండికొడుతున్నారనే ప్రచారానికి తెరలేపింది. ఈ ప్రచారానికి ఊతమిచ్చేలా గతంలో చోటు చేసుకున్న ఓటుకు నోటు కేసును, రేవంత్ రెడ్డి.. చంద్రబాబును పొగిడే వీడియోలను, వార్తలను బీఆర్ఎస్ సోషల్ మీడియా వైరల్ చేసింది.

తాజాగా తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి వివాదాలకు సైతం సెంటిమెంట్ రంగులద్దే పనిలో పడింది బీఆర్ఎస్. బనకచర్ల విషయంలో రేవంత్ రెడ్డి.. చంద్రబాబుకు లొంగిపోయారని.. ఇటీవల జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో రేవంత్ బేలతనం కనపడిందంటూ విమర్శలు చేస్తోంది. తెలంగాణ నీటి వాటలను రేవంత్ ఆంధ్రాకు కట్టబెడుతూ.. ప్రజలకు అన్యాయం చేస్తున్నారని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఈ ఆరోపణలను కాంగ్రెస్ తిప్పికొడుతున్నా బీఆర్ఎస్ మాత్రం ఆ ఫ్లేవర్ ను మార్చడం లేదు.

ఇదంతా చూస్తే బీఆర్ఎస్ కు కాంగ్రెస్ పాలనపై విమర్శల దాడి చేయడం కన్నా ప్రజల్లో సెంటిమెంట్ రాజేసి లబ్ధి పొందాలనే ఆలోచనే బలంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఐతే ప్రత్యేక రాష్ట్ర సాధన సమయంలో పనిచేసిన సెంటిమెంట్ అస్త్రం.. దశాబ్దం దాటిన తర్వాత వర్కవుట్ అవుతుందా..? బీఆర్ఎస్ కు అధికారాన్ని తెచ్చిపెడుతుందా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.





Image credit: twitter.com/krg_reddy

## కాంగ్రెస్ నీ వ్యక్తిగత సామ్రాజ్యమా? సీఎం రేవంత్ కు కోమటిరెడ్డి కౌంటర్

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ లో యంగ్ ఇండియా స్కూల్ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపాయి. 2034 వరకు తానే సీఎంగా ఉంటానంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖలపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ..రాబోయే పదేళ్లు నేనే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి గారు ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ లో అధిష్ఠానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుంది. తెలంగాణ కాంగ్రెస్ ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరు. అని తన ఎక్స్ ఖాతాలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోస్ట్ చేశారు.

ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి ఆశించినప్పటికీ అవకాశం రాలేదు. అప్పటి నుంచి పార్టీపైన, సీఎం రేవంత్ పైన గుర్రుగా ఉన్న రాజగోపాల్ రెడ్డి తొలిసారి తన మనసులోమాట బయటపెట్టారు. 2034 వరకు నేనే సీఎం అన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. రాజగోపాల్ రెడ్డి తీరుతో గత కొంతకాలంగా సైలెంట్ గా ఉన్న పదవులు రాని నాయకులు సైతం సీఎం రేవంత్ పై విమర్శలు ఎక్కుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

## వరిగుంటం అనిల్ హత్యకేసులో పోలీసుల స్పష్టత

- **మీడియా కథనాలపై పోలీసుల అసంతృప్తి**
- **రవీందర్‌రెడ్డిపై ఫిర్యాదు ఆరోపణలు అవాస్తవం**
- **చిత్తూరు ఎమ్మెల్యే మనవడిపై ఆరోపణలు పుకార్లే**
- **ఆస్తి వివాదమే హత్యు కారణమై ఉండవచ్చన్న అనుమానం**
- **తప్పుడు ప్రచారానికి దూరంగా ఉండాలని విజ్ఞప్తి**



**టీపీఎన్, మెదక్:** కొల్చారం మండలం వరిగుంటం శివార్లలో జూలై 14న దారుణ హత్యకు గురైన కాంగ్రెస్ నాయకుడు అనిల్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసుపై పలు మీడియా కథనాలపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము అధికారికంగా వివరాలు వెల్లడించకుండానే ప్రసారాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. అనిల్ కుటుంబ సభ్యులు స్వస్థలానికి చెందిన రవీందర్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారనే కథనాలు నిజం కాదని స్పష్టం చేశారు. బాధితుడి తల్లి దండ్రులు అలాంటి ఫిర్యాదు చేయలేదని అధికారులు స్పష్టం చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే మనవడిపై సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆరోపణలు పుకార్లు మాత్రమేనని ఖండించారు. "ఈ కేసుతో ఆయనకు సంబంధం ఉన్న ఆధారాలేవీ లేవు. ఆ ఆరోపణలు పూర్తిగా ఊహాజనితమైనవే," అని పోలీసులు స్పష్టంచేశారు. ఆస్తి వివాదం నేపథ్యంలోనే అనిల్ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం దర్యాప్తు సాగుతోందని పోలీసులు తెలిపారు. ప్రజలు, మీడియా ఎవరూ తప్పుడు సమాచారాన్ని ప్రసారం చేయవద్దని, కేసులో న్యాయం జరిగేలా కట్టుబాటుగా వ్యవహరిస్తున్నామని పోలీసులు తెలిపారు. దర్యాప్తు పూర్తయ్యేంత వరకూ ఓర్పుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రకటనలకే పరిమితమైన ప్రభుత్వ చర్యలు

- **యూరియా కొరతపై గండ్ర విమర్శలు**
- **యూరియా లేక రైతుల ఇబ్బందులు**
- **రైతుల బాధలపై ప్రభుత్వ నిర్లక్ష్యం**
- **బ్లాక్ మార్కెట్ పెరిగిందని ఆరోపణలు**
- **పద్దతిలేని పాలన.. డైవర్షన్ పాలిటిక్స్**



**టీపీఎన్, తెలంగాణ:** రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై బీఆర్ఎస్ నేత గండ్ర వెంకటరమణ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎరువుల సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సకాలంలో సరఫరా లేకపోవడంతో రైతులు ప్రభుత్వ నిర్ణయించిన ధర రూ.266.50కి యూరియాను పొందలేక, బ్లాక్ మార్కెట్‌లో రూ.325 వరకు చెల్లిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరఫరా బదులుగా మధ్యవర్తులకు మేలు జరుగుతోందని ఆరోపించారు. ఎరువుల సరఫరాలో జాప్యం వల్ల రైతులు తీవ్ర అసంతృప్తికి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇటీవల నడ్డాతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరిపి, సరఫరా పెంచేలా హామీ తీసుకున్నా... ప్రస్తుతానికి గ్రౌండ్ రియాలిటీ వేరేలా ఉందన్నారు. రైతులు ఇంకా లైన్‌లో నిలబడి బ్యాగ్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. సరైన వ్యవస్థ లేకపోతే ఎరువుల కొరత మాత్రమే కాక, భవిష్యత్తులో నేలలు కూడా బలహీనమయ్యే అవకాశాలున్నాని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యాయని అన్నారు. ఎరువుల సరఫరాలో పారదర్శకత, డిమాండ్ ఆధారిత పంపిణీ లేకుంటే సమస్యలు ఎదురవుతాయన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం మొగుళ్లపల్లిలో రైతులు రోడ్డెక్కిన దుస్థితి చూస్తూ ప్రభుత్వం మౌనంగా ఉందని విమర్శించారు. రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించిందన్నారు. వరంగల్‌లో ఇచ్చిన రైతు డిక్లరేషన్‌ను అమలు చేయకుండా, రైతుల్ని మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో రైతులు కాంగ్రెస్‌ను గెలిపించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారు ఎదుర్కొంటున్న కష్టాలపై ఒక్కసారి కూడా సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కేంద్రం ఎరువులు పంపితేనే ఇస్తామంటున్నారు. ఇది చెప్పడానికి కూడా వారు సిగ్గుపడాలని ఫైర్ అయ్యారు. కేంద్ర మంత్రులు సేంద్రియ వ్యవసాయం చేయమంటున్నారు. ఇద్దరు పాలకులు కూడా విఫలమయ్యారన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ రోడ్డెక్కడం ఖాయం గండ్ర హెచ్చరించారు. ఒక్క మీటింగ్ కూడా రేవంత్‌రెడ్డి కేసీఆర్, కేటీఆర్ పేర్లు ఎత్తకుండా మాట్లాడలేరని అన్నారు. పిల్లల కార్యక్రమాల్లో సైతం రాజకీయ ప్రస్తావనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది పరిపాలనా అనుభవం లేని నేతకే సాధ్యమవుతుందని విమర్శించారు. పదేళ్లు సీఎంగా ఉంటానన్నది పగటికలే.. రేవంత్‌కు తగిన బుద్ధి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అని గండ్ర వెంకటరమణా రెడ్డి వ్యాఖ్యానించారు.

## తెలంగాణ బీజేపీలో ముసలం.. కమలం పార్టీలో కలహాలు





తెలంగాణ బీజేపీ నేతల మధ్య నెలకొన్న వర్గ విభేధాలు ఒక్కొక్కటీ వెలుగుచూస్తున్నాయి. కొత్త అధ్యక్షుడి ఎంపికకు ముందు రాజాసింగ్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ చేసి విమర్శలు చేశారు. ఇప్పుడు కరీంనగర్ జిల్లాలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్, మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉంది. ఇంతకాలం నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు ఇప్పుడు పరాకాష్టకు చేరాయి. ఈటెల బీజేపీలో చేరిన్పటి నుంచే ఇరు వర్గాల మధ్య అంతర్గతంగా ఆదిపత్యపోరు నడుస్తోంది. తాజాగా అవి తారాస్థాయికి చేరి పరస్పరం విమర్శించుకునే వరకు వచ్చాయి.

హుజూరాబాద్ కు చెందిన బీజేపీ అసంతృప్త నేతలు శామీర్‌పేటలో ఈటెల రాజేందర్ నివాసంలో కలిసి తమకు స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఈటెల రాజేందర్ మాట్లాడిన మాటలు తెలంగాణ బీజేపీలో సంచలనం రేపాయి. అసలు నువ్వెవరు, నీ శక్తి ఎంత, నేను 2002లో జిల్లాకు వచ్చాను, మంత్రిగా పనిచేశాను, నేను అడుగుపెట్టని గ్రామం లేదు, ఖబర్దార్ బిడ్డా అంటూ హెచ్చరించారు. అంతేకాకుండా తనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నవారి వివరాలతో అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తానని ఈటెల హెచ్చరించారు. ఇక్కడ ఈటెల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు బండి సంజయ్ ని ఉద్దేశించేనని బీజేపీ నాయకులు కూడా చెప్పుకుంటున్నారు. మరోవైపు ఈ వ్యవహారంపై ఎవరు స్పందించవద్దని.. అధిష్ఠానమే చూసుకుంటుందని బండి సంజయ్ కూడా తన వర్గానికి సూచించారు.

ఆదిపత్య పోరే విభేదాలకు బీజం

బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన ఈటెల.. బీజేపీలో చేరినప్పటి నుంచే ఇద్దరి మధ్య సఖ్యత లేదన్న ప్రచారం ఉంది. ఈటెల రాష్ట్రమంత్రిగా, హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఉంటూ.. అప్పుడు ఎంపీగా ఉన్న బండి సంజయ్ ని పట్టించుకునే వారు కాదన్న ప్రచారం జరిగింది. దీంతో ఈటెల బీజేపీలో చేరిన తర్వాత రాష్ట్ర అధ్యక్షుడైన బండి సంజయ్ కుమార్ రాజేందర్‌ను దూరం పెట్టారని పార్టీలో చెప్పుకుంటున్నారు. ఎంపీ ఎన్నికల్లో హుజూరాబాద్‌లో బండికి తక్కువ మెజార్టీ వచ్చేలా ఈటల వర్గీయులు పనిచేశారని సంజయ్ వర్గీయులు ఆరోపించారు. ఇలా మొదలైన విభేదాలు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఈటల రాజేందర్ ఆశించిన సమయంలో.. అధ్యక్ష పదవి ఈటల రాజేందర్ కు రాకుండా చేయడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ పాత్ర ఉందన్న ప్రచారం జోరుగా సాగింది. దీంతో ఇద్దరి మధ్య మరింత దూరం పెరిగింది. మరోవైపు కాళేశ్వరం కమిషన్ విచారణ సందర్భంగా ఈటెల వ్యాఖ్యలను బండి సంజయ్ పరోక్షంగా తప్పుపట్టారు. ఇది కూడా ఇద్దరి మధ్య మరింత దూరం పెంచిందన్న ప్రచారం ఉంది.

బీజేపీ అధిష్ఠానం ఏం చేయబోతోంది?

ఇద్దరు ఎంపీల మధ్య నెలకొన్న విభేదాలు బీజేపీ కేంద్ర నాయకత్వ దృష్టికి వెళ్లినట్టు సమాచారం. ఈటెల వ్యాఖ్యలపై పార్టీ నేతల స్పందన, అందుకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్స్ అధిష్టానానికి పంపుతున్నట్టు తెలుస్తోంది. తాజాగా శామీర్‌పేటలోని తన నివాసంలో కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఈటల రాజేందర్ మాట్లాడిన మాటలు బీజేపీలో ప్రకంపనలు రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై చర్చించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కూడా ఢిల్లీ వెళ్తున్నట్టు సమాచారం వస్తోంది. మొత్తం మీద ఇద్దరు రాష్ట్ర అగ్రనేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరుపై పార్టీ అధిష్ఠానం ఎలాంటి ముగింపు ఇస్తుందన్నది చర్చనీయాంశమైంది.



# బోనాల పండుగకు రూ.20 కోట్లతో ఏర్పాట్లు

**టీపీఎన్, హైదరాబాద్:** నగరంలో బోనాల పండుగ ఈ ఏడాది అపూర్వంగా నిర్వహించబడిందని మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం అంబర్‌పేట్‌లోని శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించానట్లు తెలిపారు. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఈ నిధులతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో బోనాల పండుగను గ్రాండ్‌గా నిర్వహించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు మేయర్ చెప్పారు.



## ఎమ్మెల్యే గణేష్‌పై దాడికి యత్నం


- కాన్వాయ్‌ని వెంబడించిన 30 మంది దుండగులు
- కారుకు అడ్డంగా వాహనాలు పెట్టి అడ్డగింత
- ఎమ్మెల్యే గన్‌మెన్‌ల గన్నులు లాక్కొనే యత్నం
- భద్రతా సిబ్బందిపై దాడికి ట్రై చేసిన దుండగులు
- అప్రమత్తంగా స్పందించి సురక్షితంగా పోలీస్ స్టేషన్ చేరిక
- కారులో నుంచి బయటకు రాకుండా తప్పించుకున్న ఎమ్మెల్యే
- వడ్డెర బస్తీలో జరిగే బోనాలకు వెళ్తుండగా ఘటన
- ఎమ్మెల్యేకు మద్దతుగా అనుచరులు, నాయకులు హాజరు

**టీపీఎన్, హైదరాబాద్:** తార్నాకలో కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి యత్నించడం కలకలం రేపింది. ఆర్టీసీ హాస్పటల్ సమీపంలో సుమారు 20 బైకులపై దూసుకొచ్చిన 30 మందికి పైగా యువకులు ఎమ్మెల్యే కారును అడ్డగించి హల్‌చల్ చేశారు. వాహనాలకు అడ్డం పెట్టి కారును ఆపిన దుండగులు గన్‌మెన్‌లను అడ్డుకుని ఆయుధాలు లాక్కొనే ప్రయత్నం చేశారు. అయితే ఎమ్మెల్యే కారులోంచి దిగకుండా అప్రమత్తంగా స్పందించి వెంటనే ఓయూ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడే ఆయన ఫిర్యాదు చేశారు. వడ్డెర బస్తీలో బోనాల జాతరకు ఆహ్వానం అందుకుని వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన స్థలం ఓయూ పీఎస్‌కు కేవలం 200 మీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం. సమాచారం తెలుసుకున్న ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ జగన్ ఘటనాస్థలికి చేరుకుని పర్యవేక్షిస్తున్నారు. ఇక పోలీస్ స్టేషన్‌కు శ్రీగణేష్ అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. ఎమ్మెల్యేపై దాడి యత్నం రాజకీయ కుట్రా? లేక వేరే ఎజెండా ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## భవనం పైకి ఎక్కి యువకుడు హల్ చల్



**టీపీఎన్, హైదరాబాద్:** రాజేంద్రనగర్‌లో ఉలిక్కిపడే ఘటన చోటు వెలుగుచూసింది. హైదర్‌గూడ సిరిమల్లె నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై ఓ యువకుడు ఎక్కి హంగామా చేశాడు. భవనం చివరి అంచున నిలబడి "దూకేస్తా... ఎవ్వరూ దగ్గరికి రాకూడదు" అంటూ అరవడం ప్రారంభించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే 100కు ఫోన్ చేసిన వారు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ సిబ్బంది యువకుడిని కిందకు పిలిచారు. "నా దగ్గరకి ఎవరైనా వస్తే వెంటనే దూకేస్తా" అంటూ యువకుడు హెచ్చరించాడు. మూడు గంటల పాటు పోలీసులకు, స్థానికులకు చుక్కలు చూపించాడు. అతడిని చివరకు రాజేంద్రనగర్ ఎస్ఐ రఘు మాటల్లో పెట్టి కిందకు దింపి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యువకుడిని శంషాబాద్‌కు చెందిన ఎల్లయ్యగా గుర్తించారు. అతడు ఘన్సీమియాగూడలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శంషాబాద్ నుంచి అత్తాపూర్‌కు వచ్చి ఆత్మహత్యకు యత్నించినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో పెట్రోలింగ్ కానిస్టేబుళ్లు రాఘవేంద్ర, అంజలయ్య, ఓ లేడీ కానిస్టేబుల్ చాకచక్యంగా వ్యవహరించి ఎల్లయ్య ప్రాణాలను రక్షించారు. అతడిని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.



## బండారు దత్తాత్రేయ నివాసంలో విశేష పూజలు

**టీపీఎన్, హైదరాబాద్:** బోనాల పండుగను పురస్కరించుకొని బండారు దత్తాత్రేయ తన నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, బీజేపీఎంపీ ఈటెల రాజేందర్ హాజరయ్యారు. సంప్రదాయ వేషధారణలో భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తున్నాయని, ప్రజలందరికీ శాంతి, ఆనందం కలగాలని ఆకాంక్షిస్తున్నట్లు దత్తాత్రేయ తెలిపారు. పూజ అనంతరం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఎంపీ ఈటెల రాజేందర్ ఆలయ సిబ్బందిని అభినందించారు.

## పవిత్ర ఆలయాల్లో డిప్యూటీ మేయర్ ప్రత్యేక పూజలు



**టీపీఎన్, హైదరాబాద్:** లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం, అక్కన్న మాదన్న మహంకాళి ఆలయాల్లో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెతో పాటు టి.టి.యు.సి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నగర ప్రజలందరికీ శాంతి, ఐశ్వర్యం చేకూరాలని దంపతులు ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

## చెవిటి మూగ యువతిపై అత్యాచారం.. బాధ తట్టుకోలేక ఆత్మహత్య




**టీపీఎన్, హైదరాబాద్:** రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. చెవిటి మూగ యువతిపై ఓ వ్యక్తి అత్యాచార యత్నం చేశాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పలేక బాధను తట్టుకోలేక ఆ యువతి ఆత్మహత్య చేసుకుంది. ప్రకాశం జిల్లా నుంచి వచ్చి అల్మాస్‌గూడలో గత 12 సంవత్సరాలుగా ఓ కుటుంబం జీవిస్తోంది. తండ్రి తన్నేరు ఏడుకొండలు, అతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇద్దరు కుమార్తెలు చెవిటి మూగలు. బాధిత కుటుంబం వెల్లడించిన వివరాల ప్రకారం "ఇంటి ఎదురుగా ఉండే శిరీష అనే మహిళ మరిది శ్రీకాంత్ అనే వ్యక్తి తరచూ వీరి ఇంటికి వచ్చేవాడు. పెద్ద కుమార్తె శ్రీలక్ష్మితో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఎవరు లేని సమయంలో ఆమెపై అత్యాచారం చేశాడు. అప్పటికే అతడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన చిన్న చెల్లెలు భువనేశ్వరి ఇంట్లోకి వచ్చేసరికి శ్రీకాంత్ బాత్రూంలో దాక్కున్నాడు. ఈ విషయం బయటకు చెబితే మీ తల్లిదండ్రులను చంపేస్తానని బెదిరించాడు. ఈ ఘటన జరిగిన 20 రోజుల తర్వాత శ్రీలక్ష్మి అతడికి ఎదురు చెప్పింది. దాంతో శ్రీకాంత్ బ్లేడుతో ఆమె గొంతు కోశాడు. స్థానికులు చూసి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తర్వాత ఆమె కోలుకుంది. కానీ మానసికంగా బలహీనపడింది. తనపై జరిగిన అఘాయిత్యాన్ని తల్లిదండ్రులకు చెప్పాలని చెల్లెలు కోరడంతో గదిలోకి వెళ్లి ఉరేసుకుంది. మృతురాలు తనపై జరిగిన విషయం ఫోటోలు చూపించి చెల్లెలికి అర్థం చేసుకునేలా చేసింది. ఆమె మాటలు రాకపోయినా తన బాధను సైగలతో చెప్పింది" అని తెలిపారు. మీర్పేట్ పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని కోసం గాలిస్తున్నారు.

# హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రైలు: చుట్టుపక్కల జిల్లాలతో నెట్వర్క్

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:** ప్రయాణీకులకు మరింత చేరువయ్యేందుకు ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్టులతో ముందుకెళ్తున్న రైల్వే శాఖ మరో అద్భుత ప్రాజెక్టు కు శ్రీకారం చుట్టబోతోంది. తెలంగాణ రవాణా రంగ అభివృద్ధిలో కీలక మైలురాయిగా భావిస్తున్న ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి తుది లొకేషన్ సర్వే పూర్తి అయింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టూ కొత్త రైల్వే మార్గం ఏర్పడనుండగా, ఇది దేశంలోనే వినూత్న ప్రయత్నంగా నిలవనుంది. తెలంగాణ రవాణా రంగ అభివృద్ధిలో కీలక మైలురాయిగా భావిస్తున్న ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి తుది లొకేషన్ సర్వే పూర్తి అయింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే, రాష్ట్ర రాజధానిని చుట్టూ కొత్త రైల్వే మార్గం ఏర్పడనుండగా, ఇది దేశంలోనే వినూత్న ప్రయత్నంగా నిలవనుంది. ఔటర్ రింగ్ రైలు మార్గం ప్రధానంగా సికింద్రాబాద్ ను అనుసంధానించే ఆరు రైలు కారిడార్లలో కలిపి రూపొందించనున్నారు. వాటిలో సికింద్రాబాద్ , కాజీపేట, వాడి, డోన్, ముర్కడ్, గుంటూరు, కొత్తపల్లి మార్గాలు ఉన్నాయి. ఈ మార్గాలతో అనుసంధానం వల్ల రైల్వే రాకపోకలపై ఉన్న ఒత్తిడి తగ్గుతుంది. ఈ రింగ్ రైలు ఏర్పాటు ద్వారా ముఖ్యంగా గూడ్స్ రైళ్లను నగరానికి రాకుండా బైపాస్ చేయవచ్చు. తద్వారా సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ వంటి ప్రధాన స్టేషన్లపై భారం తగ్గే అవకాశం ఉంటుంది. అంతర్రాష్ట్ర రైళ్లు ఈ కొత్త మార్గం ద్వారా సాఫీగా ప్రయాణించగలవు. ప్రాజెక్టు కోసం దక్షిణ మధ్య రైల్వే మూడు వేర్వేరు ఎలైన్ మెంట్లను ప్రతిపాదించింది. వాటిలో ప్రతి దానికీ దూరం, వ్యయం. మలుపుల సంఖ్య, టన్నెళ్ల పొడవు వంటి అంశాలపై స్పష్టమైన అంచనాలు రూపొందించారు. వీటిలో దూరం 392 కిలోమీటర్ల నుంచి 511 కిలోమీటర్ల వరకు ఉండే అవకాశముంది. ఈ మూడు ప్రతిపాదిత మార్గాల్లో నిర్మాణ వ్యయం రూ.12,070 కోట్ల నుంచి రూ.17,763 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు సాంకేతికత, భౌగోళిక పరిస్థితులు, భూసేకరణ పరిస్థితుల ఆధారంగా ఎలైన్ మెంట్ను ఖరారు చేయనున్నారు. ఔటర్ రింగ్ రైలు మార్గం మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్నగర్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సిద్ధిపేట వంటి జిల్లాలకు అనుసంధానమవుతుంది. కొన్ని ప్రతిపాదనలలో కామారెడ్డి, జనగామ వంటి జిల్లాలూ చేరే అవకాశం ఉంది. దీంతో ప్రజలకు హైదరాబాద్ చేరడం సులభమవుతుంది. ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా నగరాన్ని చుట్టూ పూర్తి స్థాయి రింగ్ రైలు నిర్మించిన దాఖలాలు లేవు. బెంగళూరు, చెన్నై, ముంబయిలో శివార్లకు టెర్మినల్స్ నిర్మించినా. హైదరాబాద్ చుట్టూ రింగ్ రైలు నిర్మాణం మాత్రం దేశంలోనే మొదటిసారి జరగనుంది. ఇది రవాణాలో సరికొత్త దిశగా తీసుకెళ్లే ప్రణాళికగా మారనుంది. ఈ రింగ్ రైలు మార్గంలో కనీసం 26 నుంచి గరిష్ఠంగా 34 స్టేషన్లు ఏర్పడే అవకాశం ఉంది. కొత్తగా రైల్వే స్టేషన్లు నిర్మించడం వల్ల స్థానిక రవాణా మెరుగవుతుంది. జిల్లాల మధ్య రైలు ప్రయాణాలు వేగవంతమవుతాయి. ఈ ప్రాజెక్టు అమలుతో హైదరాబాద్ నగరానికి వచ్చిన రైళ్లను ఔటర్ రింగ్ రైలులో మళ్లించవచ్చు. దీనివల్ల నగరంలోని ప్రధాన స్టేషన్లపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గిపోతుంది. ఇది ఔటర్ రింగ్ రోడ్ తరహాలో నగరానికి బయటే రాకపోకలు నడిపించే అవకాశాన్ని కల్పిస్తుంది. ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి కావడంతో తదుపరి దశలో ఎలైన్మెంట్ను ఖరారు చేసి నిర్మాణానికి అనుమతులు పొందే ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర రైల్వే శాఖ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది.



# అణుశక్తికి మూలాధారమైన అశ్వాపురం

**టీపీఎన్, భద్రాద్రి** కొత్తగూడెం: అశ్వాపురం మండలంలో నెలకొల్పబడిన హెవీ వాటర్ ప్లాంట్ భారతదేశ అణుశక్తి కార్యక్రమంలో కీలక పాత్ర పోషిస్తున్న ఒక వ్యూహాత్మక ప్రాముఖ్యత కలిగిన సంస్థ. ఈ ప్లాంట్ స్థాపన నుండి నేటి వరకు అనేక ఒడిదుడుకులను, సాంకేతిక సవాళ్లను అధిగమించి, దేశ రక్షణ, ఇంధన భద్రతకు గణనీయమైన తోడ్పాటునందిస్తోంది.

**స్థాపన, ప్రారంభ లక్ష్యాలు**

అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ 1980వ దశకంలో స్థాపించబడింది. భారతదేశం తన స్వంత అణు ఇంధన కార్యక్రమాన్ని బలోపేతం చేసుకోవడంలో భాగంగా, హెవీ వాటర్ (డ్యుటీరియం ఆక్సైడ్ D□O) ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఏర్పడింది. అణు రియాక్టర్లలో న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడానికి (మోడరేటర్‌గా), అలాగే కొన్ని రకాల రియాక్టర్లలో కూలెంట్‌గా హెవీ వాటర్ అత్యవసరం. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, దేశీయ అవసరాలను తీర్చడమే ఈ ప్లాంట్ ప్రధాన లక్ష్యం. దీని ఏర్పాటుతో, హెవీ వాటర్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఆత్మనిర్భరత సాధించడానికి ఒక ముఖ్యమైన అడుగు పడింది.

**సాంకేతిక ప్రక్రియ, ఉత్పత్తి**

అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ హైడ్రోజన్ సల్ఫైడ్ (H□S) వాటర్ ఎక్స్ఛేంజ్ ప్రాసెస్ ను ఉపయోగించి హెవీ వాటర్ ను ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రక్రియలో, హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువును సాధారణ నీటితో చర్య జరిపి, హైడ్రోజన్ ఐసోటోపులైన ప్రొటియం, డ్యుటీరియంలను వేరు చేస్తారు. ఈ సంక్లిష్ట ప్రక్రియలో అధిక పీడనం, ఉష్ణోగ్రతల వద్ద రసాయన చర్యలు జరుగుతాయి. ప్లాంట్ లో ఉత్పత్తి అయ్యే హెవీ వాటర్ అధిక స్వచ్ఛత కలిగి ఉంటుంది, ఇది అణు రియాక్టర్లలో సురక్షితంగా ఉపయోగించడానికి అవసరం.

**ఎదురైన సవాళ్లు, అధిగమించిన తీరు**

ప్లాంట్ ప్రారంభం నుండి అనేక సవాళ్లను ఎదుర్కొంది. సాంకేతిక సవాళ్లు: హెవీ వాటర్ ఉత్పత్తి ప్రక్రియ అత్యంత సంక్లిష్టమైనది, సున్నితమైనది. ప్రారంభంలో, సాంకేతిక సమస్యలు, పరికరాల వైఫల్యాలు ఎదురయ్యాయి. అయితే, ప్లాంట్ ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు, అభివృద్ధి ద్వారా ఈ సమస్యలను పరిష్కరించారు.పర్యావరణ సవాళ్లు: హెవీ వాటర్ ఉత్పత్తికి ఉపయోగించే కొన్ని రసాయనాలు పర్యావరణంపై ప్రభావం చూపవచ్చు. ప్లాంట్ పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా వ్యర్థాల శుద్ధి, నిర్వహణలో కఠినమైన ప్రమాణాలను పాటిస్తుంది. భద్రతా సవాళ్లు: అణు సంబంధిత సంస్థ కావడంతో, ప్లాంట్ కు అధిక స్థాయి భద్రతా చర్యలు అవసరం. ఉగ్రవాద బెదిరింపులు, ఇతర భద్రతాపరమైన ప్రమాదాలను ఎదుర్కోవడానికి పటిష్టమైన భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేయబడ్డాయి.నిధుల కేటాయింపు, విస్తరణ: ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడానికి, సాంకేతికతను మెరుగుపరచడానికి ఎప్పటికప్పుడు నిధుల కేటాయింపు, విస్తరణ ప్రాజెక్టులు చేపట్టబడ్డాయి.

భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ

అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ అత్యున్నత స్థాయి భద్రతా ప్రమాణాలను పాటిస్తుంది. ప్లాంట్ లోపల, చుట్టూ కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. ప్లాంట్ నిర్వహణ, వ్యర్థాల శుద్ధి, పర్యావరణ పర్యవేక్షణ విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తుంది. ప్లాంట్ నుండి



విడుదలయ్యే వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసి, పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. పర్యావరణ పర్యవేక్షణ బృందాలు నిరంతరం గాలి, నీరు, మట్టి నాణ్యతను పర్యవేక్షిస్తాయి.

**స్థానిక ఆర్థిక వ్యవస్థపై ప్రభావం**

అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ కేవలం అణుశక్తి రంగానికే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా గణనీయమైన తోడ్పాటునందిస్తోంది: ఉపాధి అవకాశాలు: ప్లాంట్ ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. స్థానికులకు సాంకేతిక, పరిపాలన, కార్మిక రంగాల్లో ఉద్యోగాలు లభించాయి. సామాజిక అభివృద్ధి: ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో పాఠశాలలు, ఆసుపత్రులు, రవాణా సౌకర్యాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా సహకరిస్తోంది. వ్యాపార అవకాశాలు: ప్లాంట్ కు అవసరమైన వస్తువులు, సేవల సరఫరా ద్వారా స్థానిక వ్యాపారాలకు ప్రోత్సాహం లభిస్తోంది.

**భవిష్యత్ ప్రణాళికలు**

భారతదేశ అణుశక్తి రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో, అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ భవిష్యత్తులో మరింత కీలక పాత్ర పోషించనుంది. హెవీ వాటర్ కు పెరుగుతున్న డిమాండ్ ను తీర్చడానికి, ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచే ప్రణాళికలు ఉన్నాయి. అలాగే, ఉత్పత్తి ప్రక్రియలో మరింత ఆధునిక సాంకేతికతను, పర్యావరణ హిత పద్ధతులను అనుసరించడానికి పరిశోధనలు జరుగుతున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురంలోని హెవీ వాటర్ ప్లాంట్ భారతదేశ అణుశక్తి ప్రయాణంలో ఒక నిశ్శబ్ద, కానీ కీలకమైన శక్తి. ఇది దేశ రక్షణ, ఇంధన భద్రతకు వెన్నెముకగా నిలుస్తూ, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా గణనీయమైన తోడ్పాటునందిస్తోంది. ఈ ప్లాంట్ సాధించిన విజయాలు, అధిగమించిన సవాళ్లు స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసానికి నిదర్శనం

# పన్నులు వసూలు, సేవలు లేవు: అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు



**టీపీఎన్, కుత్బుల్లాపూర్**: బౌరంపేట ప్రాంతంలోని సింహపురి కాలనీవాసులు ఆందోళన చేశారు. చుట్టుపక్కల నెలకొన్న మురుగు నీటి వల్ల దుర్వాసనతో పాటు దోమల వల్ల రాత్రివేళలు గడవడం కష్టంగా మారిందని ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. కాలనీ పక్కనే ఉన్న బలిజవానికుంటలో డ్రైనేజీ నీరు చేరుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో సమస్యలు మితిమీరిపోతున్నాయని, చెరువులో చేరిన మురుగు నీటి వల్ల బోర్ల నుంచి వచ్చే నీరు కలుషితం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా ఈ సమస్యలపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. సొంత డబ్బులతో రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. మున్సిపల్ అధికారులు మాత్రం పన్నులు కట్టించుకోవడంలో మాత్రమే ముందున్నారని మండిపడ్డారు. బలిజవానికుంట చెరువులో మిగిలిన ప్రభుత్వ భూమిని పార్కుగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బలిజవానికుంట నుంచి రాంజీకుంట వరకు ఉన్న నాలా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో హామీలతో ముందుకు వచ్చే రాజకీయ నేతలు, ప్రజల బాధలు పట్టించుకోరని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కుతో తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఆకుల సతీష్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, పలువురు నివాసితులు పాల్గొన్నారు.



## బోనాల సంబురంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్

**టీపీఎన్,మల్కాజిగిరి, జూన్** :ఈస్ట్ ఆనంద్ డివిజన్ పరిధిలోని పీవీఎన్ కాలనీలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబు సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, నాగేష్, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## లెనిన్‌నగర్ మైసమ్మ ఆలయంలో బోనాల పూజలు

**టీపీఎన్, రంగారెడ్డి:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్ కట్ట మైసమ్మ ఆలయంలో ఆదివారం ఆషాఢ బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, అధ్యక్షులు శీను నాయక్, అర్కల కామేష్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఓపెన్ సోర్స్ టెక్నాలజీ వినియోగంపై పరిశీలన

**టీపీఎన్, భద్రాద్రి కొత్తగూడెం:** గిరిజన సంక్షేమ పథకాల అమలును పరిశీలించేందుకు ఐఐటీ బాంబే ప్రొఫెసర్ కన్నన్ మౌడగలయ భద్రాచలంలో పర్యటించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పీవో బి. రాహుల్‌తో కలిసి వైటిసి, ట్రైబల్ మ్యూజియంను సందర్శించారు. భద్రాద్రి జిల్లాలో ఓపెన్ సోర్స్ జియో స్పెషల్ టెక్నాలజీ ద్వారా గ్రామీణ సమస్యల పరిష్కారానికి విద్యార్థులు, అధికారులు కలిసి పని చేస్తున్న విధానాన్ని ప్రశంసించారు. గిరిజనులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేందుకు తీసుకుంటున్న చర్యలపై అవగాహనకోసం పర్యటనకు వచ్చినట్లు చెప్పారు. ఓపెన్ సోర్స్ జీఐఎస్ కోహర్ట్ అవార్డులను కలెక్టరుకు అందించిన విషయాన్ని ప్రస్తావించారు. గిరిజన సంప్రదాయాలను నేటి తరం యువతకు పరిచయం చేసేలా మ్యూజియం అభివృద్ధి చేయడం అభినందనీయమని కొనియాడారు. అన్ని కళాఖండాల వివరాలను తెలుగుతో పాటు ఇంగ్లీష్‌లోనూ ప్రదర్శించాలని సూచించారు. గిరిజన యువతకు ఉద్యోగ శిక్షణలు, మట్టీ ఇటుక తయారీకి మిషనరీలు, ఇతర ఉపాధి అవకాశాలు అందిస్తున్నామని కలెక్టర్.. ప్రొఫెసర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి సున్నం రాంబాబు, మేనేజర్ ఆదినారాయణ, ఆర్ఐ నరసింహారావు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు నేతల స్మరణ సభలు..

# ఆగస్టు 3న బంద్‌కు పిలుపు

**టీపీఎన్,** తెలంగాణ:భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్) తూర్పు ప్రాంతీయ బ్యూరో జూలై 17న ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ మరణాన్ని స్మరించుకుని జూన్ 11 నుంచి ఆగస్టు 3 వరకు స్మారక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అలాగే 'లుగుబురు' ఎన్‌కౌంటర్లో మరణించిన కమిటీ సభ్యుడు కామ్రేడ్ వివేక్ అలియాస్ కరం, మరో 8 మందిని స్మరించేందుకు జూలై 20 నుంచి ఆగస్టు 3 వరకు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. మావోయిస్టు సంస్థ ఆధీన ప్రాంతాల్లోని గ్రామాల్లో బహిరంగ సభలు, ర్యాలీల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచాలని పార్టీ సభ్యులకు ఆదేశించింది. బసవరాజ్, వివేక్‌ల "ఆత్మబలిదానాలు"ను స్మరిస్తూ విప్లవ మార్గంలో కొనసాగాలని ప్రేరణాత్మకంగా పేర్కొంది. అదేవిధంగా భద్రతా దళాలు చేపట్టిన 'ఆపరేషన్ కాగర్'పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ... ఆగస్టు 3న బీహార్, జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, అస్సాంలలో ఒకరోజు బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ ప్రకటనలో కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వాన్ని 'ఫాసిస్టు, బ్రాహ్మణీయ హిందూత్వ శక్తులు'గా విమర్శించిన మావోయిస్టులు... తమపై జరుగుతున్న పోలీస్ దాడులను "అనాగరిక అణచివేత చర్యలు"గా అభివర్ణించారు. ఆగస్టు 3న జరగనున్న బంద్‌ను ప్రజలంతా విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు, మద్దతుదారులకు తూర్పు బ్యూరో పిలుపునిచ్చింది.



# ఎబిలిజం vs ప్రత్యేక అవసరాలు

## విద్యలో విధాన సవాళ్లు మరియు సామాజిక తప్పిదాలు..!






ఎబిలిజం vs ప్రత్యేక అవసరాలు : "ఏబిలిజం" మరియు "ప్రత్యేక అవసరాలు" అనే పదాలు రెండు వేర్వేరు కానీ ఒకదానితో ఒకటి సంబంధం కలిగిన భావనలను సూచిస్తాయి, ఇవి వ్యక్తుల అనుభవాలను ప్రపంచవ్యాప్తంగా గాఢంగా ప్రభావితం చేస్తాయి, తరచుగా వివక్షకు దారితీస్తాయి. "ప్రత్యేక అవసరాలు" అనేది శారీరక, మానసిక, బౌద్ధిక, లేదా ఇంద్రియ సంబంధిత అవసరాలను సూచిస్తుంది, ఇవి వివిధ అడ్డంకులతో సంకర్షణలో, సమాజంలో పూర్తి భాగస్వామ్యాన్ని అడ్డుకోవచ్చు. ఏబిలిజం అనేది ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులపై వివక్ష మరియు సామాజిక పక్షపాతం, ఇది సాధారణ సామర్థ్యాలు ఉన్నతమైనవి అనే నమ్మకంలో మూలాలు కలిగి ఉంటుంది. ఈ విస్తృత భావజాలం స్పష్టంగా మరియు సూక్ష్మంగా వ్యక్తమవుతుంది, ప్రభుత్వ విధానాలలో ముఖ్యమైన సవాళ్లను సృష్టిస్తూ, ముఖ్యంగా విద్యలో విస్తృతమైన సామాజిక అపోహలను పెంపొందిస్తుంది. నిజంగా సమ్మిళిత మరియు సమాన సమాజాలను నిర్మించడానికి ఈ సమస్యలను పరిష్కరించడం చాలా కీలకం.

ఏబిలిజం యొక్క సారాంశం ఏమిటంటే, ప్రత్యేక అవసరాలు లేని వ్యక్తులు ఆదర్శ మానవ రూపాన్ని సూచిస్తారని ఊహిస్తుంది, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు "సరిచేయబడాలి" లేదా స్వాభావికంగా "తక్కువ" అని సూచిస్తుంది. ఈ నమ్మకం ప్రతికూల దృక్పథాన్ని కొనసాగిస్తుంది, ప్రత్యేక అవసరాలను "వైకల్యం" అని చిత్రీకరిస్తుంది, ఇది మానవ అనుభవంలో సహజమైన వైవిధ్యం కాకుండా లోపంగా భావిస్తుంది. ఏబిలిజం బెదిరింపు వంటి శత్రుత్వ చర్యల నుండి, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులను హానిచేసే కానీ దయగల దృక్పథాల వరకు విస్తరిస్తుంది, వారిని బలహీనులుగా లేదా జాలిపడవలసిన వస్తువులుగా చూస్తుంది. వ్యవస్థాగతంగా, ఇది సామాజిక నిబంధనలు మరియు శక్తి నిర్మాణాలలో ఇమిడి ఉంటుంది, తరచుగా అపశక్తిగా పనిచేస్తుంది, దానిని గుర్తించడం మరియు పరిష్కరించడం సవాలుగా ఉంటుంది. ప్రత్యేక అవసరాలు మరియు సామాజిక సవాళ్లను అర్థం చేసుకోవడానికి సామాజిక నమూనా ఒక కీలకమైన దృక్పథం. వైద్య నమూనా ప్రత్యేక అవసరాలను వ్యక్తిగత లోపంగా చూస్తుంది, కానీ సామాజిక నమూనా సవాళ్లు సామాజిక అడ్డంకుల నుండి ఉత్పన్నమవుతాయని పేర్కొంటుంది. ఈ అడ్డంకులు, వ్యక్తి యొక్క పరిస్థితి కాదు, భాగస్వామ్యాన్ని పరిమితం చేస్తాయి. ఉదాహరణకు, వీల్‌చైర్ ఉపయోగించే వ్యక్తి వారి చలనశీలత వల్ల పరిమితం కాదు, కానీ ర్యాంపులు లేకపోవడం లేదా సులభంగా అందుబాటులో లేని రవాణా వల్ల పరిమితం అవుతారు. ఈ దృక్పథం బాధ్యతను సమాజంపైకి మారుస్తుంది, అడ్డంకులను తొలగించడానికి అనుగుణంగా మార్చడానికి, వ్యక్తులను "వైకల్యం" గలవారిగా లేబుల్ చేయడం కాదు. "వైకల్యం" మరియు "డిసేబుల్" అనే పదాలే సమస్యాత్మకమైనవి; వ్యక్తులను వారు సాధారణంగా చేయలేని పనుల ద్వారా నిర్వచించడం కాకుండా, వారు విభిన్నంగా పనులు చేయగలరని అభినందించి, వారిని "విభిన్న సామర్థ్యం కలిగినవారు"గా గుర్తించాలి. ప్రభుత్వ విధానాలు, తరచుగా ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో ఉన్నప్పటికీ, వాటి రూపకల్పన మరియు అమలులో ఏబిలిజాన్ని కొనసాగిస్తాయి. సులభంగా అందుబాటులో లేని వాతావరణాలు మరియు పాఠ్యాంశాలను సృష్టించడం మరియు నిర్వహించడం ఒక ప్రధాన సవాలు. పబ్లిక్ ప్రదేశాలు, రవాణా, మరియు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో సార్వత్రిక రూపకల్పనను తప్పనిసరి చేయడంలో విధానాలు తరచుగా విఫలమవుతాయి, దీనివల్ల ర్యాంపులు లేని మెట్లు, అందుబాటులో లేని టాయిలెట్లు, వీడియోలు మరియు చిత్రాలపై ఆడియో వివరణలు లేకపోవడం, లేదా సహాయక సాంకేతికతలతో అనుకూలంగా లేని సంక్లిష్ట ఆన్‌లైన్ సేవలు వంటి భౌతిక అడ్డంకులు ఏర్పడతాయి. ఈ వ్యవస్థాగత పర్యవేక్షణ విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులను అవసరమైన సేవలు, ఉపాధి, మరియు పౌర భాగస్వామ్యం నుండి మినహాయిస్తుంది. చారిత్రాత్మకంగా, విధానాలు యూజెనిక్స్ ఉద్యమం లేదా ఓటు హక్కులను నిరాకరించడం వంటి స్పష్టమైన వివక్షను కలిగి ఉండేవి. నేటిగా, విద్య, ఆరోగ్య సంరక్షణ, మరియు ఉపాధిలో సౌకర్యాలకు తగిన నిధులు లేకపోవడం లేదా ప్రయోజనాలను పొందడానికి సంక్లిష్టమైన బ్యూరోక్రాటిక్ ప్రక్రియల ద్వారా విధానాలు పరోక్షంగా వివక్షను కొనసాగిస్తాయి. అంతేకాక, రాజకీయ కార్యాలయాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తుల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం వల్ల వారి ప్రత్యేక దృక్పథాలు తరచుగా విధాన రూపకల్పనలో పట్టించుకోబడవు, ఇది అసమర్థమైన పరిష్కారాలకు దారితీస్తుంది. విద్యలో, పాతబడిన బోర్డులు మరియు పద్ధతులు ఈ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయి. సాంప్రదాయ పెన్‌అండ్‌పేపర్ వ్యవస్థలు, తీక్షణమైన కళ్ళు, చెవులు, మరియు నరాలను డిమాండ్ చేస్తాయి, అనుకూల జ్ఞాన సముపార్జన మరియు వివరణను సమకూర్చడంలో విఫలమవుతాయి. ఇది విభిన్న సామర్థ్యం కలిగిన విద్యార్థులు వృద్ధి చెందడానికి సంఘర్షించే వ్యవస్థను కొనసాగిస్తుంది. గుర్తుంచుకోండి, విరిగిన వ్యక్తులను సరిచేయడం కంటే బలమైన పిల్లలను నిర్మించడం ఎల్లప్పుడూ సులభం, సామాజిక వైఫల్యం మరియు నిరుద్యోగం వల్ల ఈ సమాజాల వృద్ధుల ఆధారపడటం మరియు నైపుణ్యాల కొరతను చూస్తే. విధాన వైఫల్యాలతో సమాంతరంగా, ప్రత్యేక అవసరాల గురించిన విస్తృత సామాజిక తప్పిదాలు సవాళ్లను గణనీయంగా తీవ్రతరం చేస్తాయి. ఇది హానికరమైన స్టీరియోటైప్‌లలో వ్యక్తమవుతుంది: ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు శాశ్వతంగా ఆధారపడేవారు, సామాజిక భారం, లేదా విషాద వ్యక్తులుగా చూడబడతారు. దీనికి విరుద్ధంగా, కొందరు రోజువారీ జీవితాన్ని నావిగేట్ చేయడం ద్వారా "ప్రేరణాత్మక" అని చూడబడతారు, దీనిని "ఇన్‌స్పిరేషన్ పోర్న్" అని పిలుస్తారు, ఇది వారి అనుభవాలను ఒక వినోదంగా తగ్గిస్తుంది. ఈ స్టీరియోటైప్‌లు వ్యక్తుల స్వయంప్రతిపత్తిని లాగేస్తాయి, అతిరక్షణ, దయగల దృక్పథాలు, మరియు వారు సంతృప్తమైన జీవితాలను గడపలేరని లేదా ఉత్పాదకంగా ఉండలేరని ఊహించడం వంటి ఫలితాలకు దారితీస్తాయి. సూక్ష్మమైన మాటలు లేదా ప్రవర్తనల ద్వారా వ్యక్తమయ్యే మైక్రోఅగ్రెషన్‌లు, ఏబిలిస్ట్ భాష లేదా ఆక్రమణాత్మక ప్రశ్నలు వంటివి, రోజువారీగా సంచితంగా, మానసిక ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. వ్యక్తులను వారి ప్రత్యేక అవసరాల ద్వారా మాత్రమే నిర్వచించడం, వారి బహుముఖ గుర్తింపులను గుర్తించకపోవడం, సామాజిక బహిష్కరణకు మరింత దోహదం చేస్తుంది. ఏబిలిస్ట్ ప్రభుత్వ విధానాలు మరియు విస్తృత సామాజిక తప్పిదాల యొక్క సంచిత ప్రభావం గాఢమైనది. ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులు ఎక్కువ నిరుద్యోగం, పేదరికం, మరియు ఒంటరితనం రేట్లను ఎదుర్కొంటారు. అంధత్వం కలిగిన వ్యక్తులకు ఇది 99% మరియు చెవిటివారికి సమానంగా ఉంటుంది. వారు నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, మరియు సమాజ భాగస్వామ్యానికి గణనీయమైన అడ్డంకులను ఎదుర్కొంటారు. ఆశ్చర్యకరంగా, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్య కోసం ప్రతి సంవత్సరం వందల కోట్ల రూపాయలు కేటాయించబడతాయి, ఇవి తరచుగా జీతాలు మరియు కార్యక్రమ ఖర్చులలో అదృశ్యమవుతాయి, విద్యా సమానత్వం లేదా శ్రేష్ఠతపై ఏమీ ఫలితం ఇవ్వవు. ఈ నిధులలో ఒక పెద్ద భాగం, సీఎస్ఆర్ నిధులతో సహా, ప్రత్యేక పాఠశాలలను నడిపే ఎన్జీవోలకు వెళ్తుంది, తరచుగా పిల్లలు ఆధారపడే చక్రాన్ని కొనసాగిస్తాయి, టాక్స్‌చెల్లించే పౌరులుగా మారడం కంటే పెన్షన్‌లకు అనుగుణంగా ఉంటాయి. వ్యవస్థాగత అడ్డంకులు మరియు పక్షపాత దృక్పథాలతో నిరంతరం పోరాడటం దీర్ఘకాల ఒత్తిడి, మానసిక ఆరోగ్య సవాళ్లు, మరియు జీవన నాణ్యత తగ్గడానికి దారితీస్తుంది. అంతేకాక, ఈ బహిష్కరణ వల్ల సమాజం నష్టపోతుంది, విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులు అందించే విభిన్న ప్రతిభ, దృక్పథాలు, మరియు సహకారాలను కోల్పోతుంది.

ముగింపుగా, ప్రత్యేక అవసరాలను జీవన అనుభవంగా మరియు ఏబిలిజాన్ని వివక్షాపూరిత భావజాలంగా వేరు చేయడం న్యాయమైన ప్రపంచాన్ని పెంపొందించడానికి పునాదిగా ఉంటుంది. ప్రభుత్వ విధానాలలోని సవాళ్లు——సులభంగా అందుబాటులో లేని మౌలిక సదుపాయాల నుండి వివక్షాపూరిత అభ్యాసాల వరకు——మరియు హానికరమైన స్టీరియోటైప్‌లు మరియు మైక్రోఅగ్రెషన్‌ల ద్వారా కొనసాగించబడే విస్తృత సామాజిక తప్పిదాలు సమిష్టిగా విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తుల పూర్తి సమ్మిళనం మరియు సమానత్వానికి గణనీయమైన అడ్డంకులను సృష్టిస్తాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి సమన్వయ ప్రయత్నం అవసరం: ప్రభుత్వాలు నిజంగా సమ్మిళిత విధానాలను రూపొందించి, కఠినంగా అమలు చేయాలి, సార్వత్రిక అందుబాటు మరియు సమాన అవకాశాలను నిర్ధారించాలి. అదే సమయంలో, సామాజిక దృక్పథాలు జాలి మరియు పక్షపాతం నుండి నిజమైన గౌరవం, అవగాహన, మరియు విభిన్న సామర్థ్యం కలిగిన వ్యక్తులను విభిన్న, సమర్థ, మరియు మానవ సమాజంలో అంతర్భాగంగా గుర్తించడం వైపు రూపాంతరం చెందాలి. వారి స్వరాలు మరియు అనుభవాలను కేంద్రీకరించడం ద్వారా, మనం ఏబిలిస్ట్ నిర్మాణాలను ధ్వంసం చేసి, అందరికీ నిజంగా అందుబాటులో ఉండే మరియు సమానమైన భవిష్యత్తును నిర్మించవచ్చు.



రామ్ కమల్, సోషల్ ఇంజినీర్,
ఏపీ సమగ్ర విద్య సలహాదారు

# జర్నలిస్టులు అంటే ఆయుధాలు లేని సైనికులు..!



సైనికుడు అనగానే, శారీరక ఆయుధాలతో సన్నద్ధమై, యుద్ధభూమిలో లేదా సాంకేతికంగా ఏదైనా కారణం కోసం పోరాడే వ్యక్తి మన కళ్ళ ముందు కనిపిస్తాడు. అయితే, విలేఖరి మాత్రం ఆయుధాలతో కాక, జ్ఞానం, పదాలు, మరియు సమాచారం ప్రపంచాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అనే లోతైన అవగాహనతో సన్నద్ధమై ఉంటాడు. అయితే, ఈ సామ్యం ఇంకా లోతుగా ఉంది: సైనికులు మరియు విలేఖరులు ఇద్దరూ తమ రంగాలలో ముందు వరుసలో ఉంటారు——శారీరకంగా మరియు సాంకేతికంగా. సైనికులు ఒక దేశాన్ని లేదా కారణాన్ని రక్షించడానికి పోరాడుతుంటే, విలేఖరులు సత్యం, ప్రజాస్వామ్యం, మరియు సమాచారం యొక్క సమగ్రతను రక్షించడానికి పోరాడతారు.

**సత్యం యొక్క యుద్ధభూమి**

సైనికుడి లక్ష్యం స్పష్టంగా ఉంటుంది: శత్రువును తటస్థీకరించడం, సహచరులను రక్షించడం, మరియు భూభాగాన్ని సురక్షితం చేయడం. విలేఖరి యొక్క లక్ష్యం, అంత స్పష్టంగా కనిపించకపోయినా, ఏ మాత్రం తక్కువ కీలకం కాదు: సత్యాన్ని వెలికితీయడం, అధికారాన్ని బాధ్యతగా ఉంచడం, మరియు ప్రజలను సమాచారం అందించడం. యుద్ధ ప్రాంతాలలో, విలేఖరులు సైనికుల వలె శారీరక ప్రమాదాలను ఎదుర్కొంటారు, కానీ వారు సేకరించే మరియు పంచే సమాచారం ఖచ్చితమైనది మరియు రాజకీయ అజెండాలు లేదా ప్రచారం ద్వారా కలుషితం కాకుండా ఉండేలా చూసుకోవడం అనే అదనపు సవాలును కూడా ఎదుర్కొంటారు.

రెండు సందర్భాలలోనూ, "యుద్ధభూమి" అధికార పాత్రలను కలిగి ఉంటుంది, మరియు కథనంను నియంత్రించే వారు——ఆయుధాల ద్వారా లేదా పదాల ద్వారా——ఘటనల దిశను రూపొందిస్తారు.

**ప్రభావం యొక్క సాధనాలు**

సైనికులు ప్రత్యక్ష శారీరక సంఘర్షణలో పాల్గొనడానికి ఆయుధాలను ఉపయోగిస్తారు, కానీ విలేఖరులు తమ వృత్తి సాధనాలను——కలం, కెమెరా, మైక్రోఫోన్, మరియు ఇంటర్నెట్——ప్రజల అవగాహనను ప్రభావితం చేయడానికి ఉపయోగిస్తారు. సరైన నివేదిక, సరైన ఫోటో, లేదా సరైన డాక్యుమెంటరీ సామాజిక ఉద్యమాలను రేకెత్తించవచ్చు, ప్రభుత్వాలను కూల్చవచ్చు, లేదా చరిత్ర గతిని మార్చవచ్చు.

ఉదాహరణకు, 1972లోని "నాపామ్ గర్ల్" ఫోటో లేదా పోలీసు హింస యొక్క వీడియో ఫుటేజ్ వంటి చిత్రాలు సైనికులు, రాజకీయ నాయకులు, లేదా మీడియా స్వయంగా కూడా ఊహించని విధంగా ప్రజల అభిప్రాయాన్ని మార్చగలవు. ఈ క్షణాలు, పదాలు మరియు చిత్రాలు స్వయంగా ఆయుధాలుగా ఉంటాయని గుర్తు చేస్తాయి, మరియు విలేఖరులు తరచూ ప్రజాస్పృహ యొక్క ముందు వరుసలో ఉంటారు.

**యుద్ధ బాధితులు**

సైనికులు మరియు విలేఖరులు ఇద్దరూ తమ "యుద్ధాల" లో బాధితులుగా మారవచ్చు. సైనికులు యుద్ధభూమిలో తమ ప్రాణాలను పణంగా పెడతారు; విలేఖరులు, ముఖ్యంగా యుద్ధ ప్రాంతాలలో, జైలు శిక్ష, చిత్రహింసలు, లేదా మరణం వంటి ప్రమాదాలను ఎదుర్కొంటారు. జమాల్ ఖషోగ్గి, డాఫ్నే కరువానా గలిజియా, లేదా మేరీ కోల్విన్ వంటి ప్రముఖ విలేఖరులను గుర్తు చేసుకోండి, వారు సత్యాన్ని చెప్పడానికి తమ జీవితాలను త్యాగం చేశారు.

ఈ "ఆయుధాలు లేని సైనికులు" సైనికుల రక్షణ కవచం కలిగి ఉండకపోవచ్చు, కానీ వారు సత్యాన్ని డాక్యుమెంట్ చేయడానికి అచంచలమైన నిబద్ధతను కలిగి ఉంటారు——గొప్ప వ్యక్తిగత ప్రమాదం ఉన్నప్పటికీ. సైనికులు తమ త్యాగాల కోసం హీరోలుగా కీర్తించబడినట్లే, ఈ ప్రమాదాలను ఎదుర్కొనే విలేఖరులు అణచివేత వ్యవస్థలను సవాలు చేయడంలో లేదా అసౌకర్య సత్యాలను వెల్లడించడంలో వారి ధైర్యం కోసం తరచూ గౌరవించబడతారు.

**నైతిక మరియు ధార్మిక ముందు వరుసలు**

సైనికుడు మరియు విలేఖరి ఇద్దరూ తీసుకోవలసిన నైతిక మరియు ధార్మిక నిర్ణయాలలో కూడా ఈ సామ్యం నిలుస్తుంది. సైనికుడు తన చర్యల యొక్క ఖర్చును ఆలోచించాలి——యుద్ధం యొక్క నైతిక పరిణామాలు ఏమిటి, మరియు ఆత్మరక్షణ ఎప్పుడు దాడిగా మారుతుంది? అదేవిధంగా, విలేఖరి "సత్యాన్ని నివేదించడం యొక్క బాధ్యత ఏమిటి?" అనే నైతిక ప్రశ్నను ఎదుర్కొంటాడు. కేవలం వాస్తవాలను నివేదించడం సరిపోతుందా, లేక అన్యాయాన్ని సవాలు చేయడం, అధికారాన్ని బాధ్యతగా ఉంచడం, మరియు స్వయంగా మాట్లాడలేని వారి కోసం న్యాయవాదిగా మారడం కూడా చేయాలా?

**పెద్ద లక్ష్యం ముఖ్యం**

ఇద్దరూ కష్టమైన పరిస్థితులలో కఠినమైన ఎంపికలను ఎదుర్కొంటారు——అది ట్రిగ్గర్ లాగడం కావచ్చు లేదా జీవితాలను ప్రమాదంలో పడవేసే సున్నితమైన కథనాన్ని ప్రచురించాలా వద్దా అని నిర్ణయించడం కావచ్చు. వస్తునిష్ఠత మరియు కార్యకర్తవాదం మధ్య గీత చాలా సన్నగా ఉంటుంది, కానీ ఇది తరచూ పెద్ద లక్ష్యం కోసం నడవబడుతుంది.


**ప్రతిఘటన మరియు స్థితిస్థాపకత**

ప్రతిఘటన ఉద్యమాలలోని సైనికుల వలె, విలేఖరులు కూడా ఆయుధాలతో నేరుగా పోరాడకపోయినా, మార్పు యొక్క ఏజెంట్లుగా ఉంటారు. అవినీతిని బయటపెట్టే, పర్యావరణ ప్రమాదాలను బహిర్గతం చేసే, లేదా మానవ హక్కుల ఉల్లంఘనలపై దృష్టి తెచ్చే పరిశోధనాత్మక విలేఖరులను గురించి ఆలోచించండి. వారు సవాలు చేసే అధికారాలచే ఎల్లప్పుడూ ప్రశంసించబడరు, మరియు తరచూ ప్రతీకారాన్ని ఎదుర్కొంటారు, అయినప్పటికీ వారి పని ప్రజాస్వామ్య సమాజాల ఆరోగ్యానికి కీలకమైనది.

**విలేఖరులు ఎక్కువ స్వేచ్ఛను అనుభవిస్తారు**



పత్రికా స్వేచ్ఛ బెదిరింపులకు గురవుతున్న దేశాలలో, విలేఖరులు తరచూ వ్యవస్థాగత అణచివేతను ఎదుర్కొంటారు——అధికార శాసన రాజ్యాలలో సైనికులు తాము నమ్మని యుద్ధాలలో పోరాడవలసి వచ్చినట్లే. అయితే, ఈ "ఆయుధాలు లేని సైనికుల" స్థితిస్థాపకత కొన్నిసార్లు ఇంకా శక్తివంతంగా ఉంటుంది, ఎందుకంటే వారు పోరాడడానికి ఉపయోగించే సాధనాలు——కలం, స్వరం, మరియు సత్యం——తీసివేయడం చాలా కష్టం. కాబట్టి, సంక్షిప్తంగా చెప్పాలంటే, "ఆయుధాలు లేని సైనికుడు" అనే సామ్యం, విలేఖరులు సాంప్రదాయ ఆయుధాలతో సన్నద్ధం కాకపోయినా, ధైర్యం, స్థితిస్థాపకత, మరియు తరచూ వ్యక్తిగత త్యాగం అవసరమైన అధికపణంగా యుద్ధంలో పాల్గొంటారని వివరిస్తుంది. వారి శక్తి కథనాలను రూపొందించడంలో, ప్రస్తుత స్థితిని సవాలు చేయడంలో, మరియు చివరికి, చరిత్ర గతిని మార్చడంలో ఉంది.



సుబ్బారావు, సీనియర్ జర్నలిస్ట్.



# వాడీవేడిగా అఖిలపక్ష సమావేశం

**టీపీఎన్, ఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశం వాడీవేడీగా జరిగింది. ప్రతిపక్షాలు బిహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక పునర్విశ్లేషణ ప్రక్రియ (ఎస్ఐఆర్), పహల్గాం ఉగ్రదాడి, భారత్ పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు సహా పలు అంశాలను లేవనెత్తాయి. కేంద్ర మంత్రి జేపీ నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, ఆప్, సహా పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ క్రమంలో సభ సజావుగా సాగడానికి సహకరించాలని విపక్ష పార్టీలను కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. పహల్గాం ఉగ్రదాడి, బిహార్‌లో ఎస్ఐఆర్, భారత్ పాక్ మధ్య కుదిరిన కాల్పుల ఒప్పందంపై ట్రంప్ వ్యాఖ్యలు తదితర అంశాలను అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ లేవనెత్తిందని ఆ పార్టీ ఎంపీ గౌరవ్ గొగోయ్ తెలిపారు. కాంగ్రెస్ లేవనెత్తిన కీలక అంశాలపై ప్రధాని మోదీ పార్లమెంటులో ప్రకటన ఇవ్వాలని కోరామన్నారు.



## మా నాన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు :
# నిశాంత్ కుమార్

**టీపీఎన్, పాట్నా:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ 2025 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఒక పెద్ద ప్రకటన చేశారు. ఈసారి మళ్ళీ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందని, తన తండ్రి నితీష్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లలో తాను చేసిన పనిని ప్రజలు అభినందిస్తారని, మరోసారి తనను భారీ మెజారిటీతో గెలిపించుకుంటారని ఆయన పేర్కొన్నారు. 'నాకు ప్రజలపై పూర్తి నమ్మకం ఉంది. గత రెండు దశాబ్దాలుగా నాన్న చేసిన పనికి ప్రతిఫలం ఖచ్చితంగా లభిస్తుంది. ప్రజలు మరోసారి ఆయనను భారీ మెజారిటీతో గెలిపిస్తారు అని నిషాంత్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇప్పటికీ నితీష్ కుమార్ నాయకత్వంపై నమ్మకం ఉందని, రాబోయే ఎన్నికల్లో ఆయన విజయానికి ఈ విశ్వాసం ఆధారం అవుతుందని ఆయన అన్నారు.



# దొంగ బాబా దారుణాలు..!

**టీపీఎన్, ముంబై:** మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లా వైజాపూర్ తాలూకాలోని షియూర్ గ్రామంలో నకిలీ బాబా షాకింగ్ కేసు వెలుగులోకి వచ్చింది. అమాయకులైన స్థానికులపై దారుణాలకు పాల్పడుతున్నాడు. సంజయ్ రంగనాథ్ పగర్ అలియాస్ 'భోందు బాబా' అనే ఈ బాబా దెయ్యాలను పారద్రోలడం, అద్భుతాలు చేయడం పేరుతో ప్రజలతో అమానుషమైన , అవమానకరమైన చర్యలకు పాల్పడుతున్నాడు. అనారోగ్య సమస్యలతో బాధపడేవాళ్లకు తన మూత్రం తాగితే అవి పోతాయంటూ నమ్మించాడు. దీన్ని నమ్మిన పలువురు స్థానికులు అతడి మూత్రం తాగారు. అలాగే మహిళలు, పురుషులపై దండలతో దండించడం, షూతో మోహంపై దాడి చేయడం లాంటివి చేశాడు. అక్కడి చెట్ల ఆకులు తినమన్నాడు. అంతేకాదు తన దగ్గరికి వచ్చేవారి మోహంపై నడవడం, పసుపు చల్లడం, షూ వాసన చూపించడం లాంటి దారుణాలకు కూడా పాల్పడ్డాడు. చివరికి దొంగ బాబా మోసాలను గుర్తించి వాళ్లకు బుద్ధి చెప్పే ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్ట్రింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఆ దొంగ బాబాను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అతడిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. తాము మోసపోయాని స్థానికులు గ్రహించారు. ఆ దొంగ బాబాను కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

# ఈనెల 23 నుంచి 26 వరకు మోదీ విదేశీ పర్యటన

**టీపీఎన్, ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 23 నుంచి 26 వరకు బ్రిటన్, మాల్దీవుల్లో నాలుగు రోజుల అధికారిక పర్యటనకు వెళ్తారు. ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, వాణిజ్యం, భద్రత , ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడం లక్ష్యంగా కొనసాగనుంది. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఆహ్వానం మేరకు మోదీ జులై 2324 తేదీల్లో యూకేను సందర్శిస్తారు. మోదీ యూకేలో పర్యటించడం ఇది నాలుగోసారి. ఇక ఈ నెల 25 26 తేదీల్లో మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశాన్ని సందర్శిస్తారు. మోదీ మాల్దీవుల్లో పర్యటించడం ఇది మూడోసారి. ముయిజ్జు అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఏ దేశాధినేత లేదా ఏ దేశ ప్రధాని మాల్దీవుల్లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో మోదీ, మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 'గౌరవ అతిథి'గా పాల్గొననున్నారు. 2024 అక్టోబరులో ముయిజ్జు భారత్ పర్యటనలో ఆమోదించిన 'భారత్‌మాల్దీవ్స్ సమగ్ర ఆర్థిక , సముద్ర భద్రతా భాగస్వామ్యం' అమలు పురోగతిని ఇరు నాయకులు సమీక్షించనున్నారు.





## అసెంబ్లీలో రమ్మీ ఆడుతున్న
# వ్యవసాయ మంత్రి..!

**టీపీఎన్, ముంబై:** మహారాష్ట్రలో రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతుంటే వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్ రావు కోకాటె మాత్రం తీరిగ్గా అసెంబ్లీలోనే ఫోన్ లో రమ్మీ ఆడుకుంటూ కూర్చున్నాడని ఎన్సీపీ నేత రోహిత్ పవార్ తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ మంత్రి మాణిక్ రావ్ కోకటే రమ్మీ ఆడుతున్న వీడియోను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులో ఉందని, ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని రోహిత్ పవార్ ఆరోపించారు. పంట బీమా కోసం, రుణమాఫీ కోసం, పంటలకు మద్దతు ధర కోసం రైతులు పోరాడుతున్నారని ఆయన గుర్తుచేశారు.ఈ సమస్యలతో అప్పులపాలైన రైతులు సగటున రోజుకు 8 మంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారని రోహిత్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ వ్యవసాయ మంత్రికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా అసెంబ్లీలోనే ఫోన్ లో రమ్మీ ఆడుకుంటూ కూర్చున్నాడని మండిపడ్డారు. మొబైల్ ఫోన్ లో రమ్మీ ఆటను పక్కన పెట్టి అప్పుడప్పుడైనా పంట పొలాల్లోకి వచ్చి రైతుల సమస్యలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. కోకాటెను మంత్రి పదవి నుంచి తొలగించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అయితే ఆ వీడియోపై మంత్రి కోకాటె స్పందించారు. తను గేమ్ ఆడలేదని, పని చేస్తున్నానని అన్నారు. ప్రతిపక్షాలకు తన పని కనిపించదని పేర్కొన్నారు.



# పార్టీకన్నా దేశమే ముఖ్యం: శశిథరూర్

**టీపీఎన్, తిరువునంతపురం:** దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు విబేధాలను పక్కనపెట్టి ..దేశం కోసం పనిచేయాలన్నారు కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్. అప్పుడే ప్రజలంతా శాంతియుతంగా జీవిస్తారని తెలిపారు. నా దృష్టిలో దేశానికే తొలి ప్రాధాన్యత ..పార్టీలన్నీ దేశాన్ని మెరుగుపరచడానికి గల సాధనాలు అన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా..ఆ పార్టీకి అనుగుణమైన మార్గంలో నడుచుకుంటూ మెరుగైన భారతదేశాన్ని రూపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.

## ఎయిరిండియా ప్రమాదంపై తప్పుడు
# ప్రచారం చేయొద్దు




**టీపీఎన్, న్యూ ఢిల్లీ:** అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనపై పాశ్చాత్య మీడియా కథనాలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఖండించారు. విమాన ప్రమాదంపై తుది నివేదిక రాకుండానే వ్యాఖ్యలు చేయడం మంచి పని కాదని సూచించారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఇప్పటికే పాశ్చాత్య మీడియా సంస్థలకు ఏఏఐబీ విజ్ఞప్తి చేసింది. అయినప్పటికీ స్వప్రయోజనాల కోసం తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారు. ఏఏఐబీపై నాకు నమ్మకం ఉందన్నారు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.

## రాజీనామా వెనక్కి తీసుకున్న ఎమ్మెల్యే అన్మోల్ ..!



**టీపీఎన్, పంజాబ్ :** పంజాబ్‌లోని ఖరార్ నియోజకవర్గం ఆప్ ఎమ్మెల్యే అన్మోల్ గగన్ మాన్ రాజీనామాను ఆ పార్టీ అధిష్ఠానం తిరస్కరించింది. పార్టీలోనే మాన్ కొనసాగుతారని తెలిపింది. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని మాన్ ప్రకటించడంతో ఆమె రాజీనామాపై తలెత్తిన ఉత్కంఠకు తెరపడింది. పంజాబ్ గాయనిగా పేరుతెచ్చుకుని రాజకీయాల్లోకి వచ్చిన 35 ఏళ్ల మాన్ 2022లో ఖరార్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. మంత్రిగా కీలక శాఖల్లో పనిచేశారు. ఆ తర్వాత మంత్రివర్గ విస్తరణలో పదవి దక్కలేదు. అనూహ్యంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడం పంజాబ్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




## రష్యాలో భారీ భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదు..!

**టీపీఎన్, రష్యా :** రష్యాలో భారీ భూకంపం సంభవించింది. రష్యా తీరంలో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. పెట్రోపవ్‌లావ్‌స్కీకామ్చాట్కా నగరానికి 144 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంతకుముందు దాదాపు గంట వ్యవధిలోనే ఈ ప్రాంతంలో ఐదు భూకంపాలు నమోదైనట్లు యూఎస్‌జీఎస్ తెలిపింది. వీటిలో 7.4 తీవ్రతతో కూడిన భూకంపం వల్ల సునామీ వచ్చే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. దీంతో కమ్చట్కా ద్వీపకల్పానికి పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే, ఆస్తినష్టం, ప్రాణనష్టం గురించి ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదు. ముందు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు.



## కాల్పుల విరమణకు సంకేతాలు ఇస్తున్న ఉక్రెయిన్

**టీపీఎన్, ఉక్రెయిన్ :** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ కాస్త మెత్తబడినట్టు తెలుస్తోంది. వచ్చే వారం కార్పుల విరమణపై చర్చలు జరిపించేందుకు రెడీగా ఉన్నట్టు రష్యాకు సంకేతాలు ఇస్తున్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడితో చేసుకున్న ఒప్పందాలను వీలైనంత త్వరగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.





## పాక్‌ను వెంటాడుతున్న అపరేషన్ సింధూర్..!

**టీపీఎన్, పాకిస్తాన్ :**
ఆపరేషన్ సిందూర్ జరిగి రెండు నెలలు దాటినా.. రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ వద్ద ఉన్న ఒకే ఒక్క రన్‌వే ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. దాని మూసివేతను మూడోసారి పొడిగించింది.ఆగస్టు 5 వరకు రన్‌వే మూసివేసి ఉంటుందని పాకిస్థాన్ తాజాగా నోటమ్ విడుదల చేసింది. విమానయాన కార్యకలాపాలు అందుబాటులో ఉండవని పేర్కొంది. అయితే ఆ మూసివేతకు కారణాలు మాత్రం వెల్లడించలేదు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మే 10న భారత్ దాడి చేసిన నేపథ్యంలో తొలి నోటమ్ జారీ అయింది. దాంతో పంజాబ్ ప్రావిన్స్‌లో ఉన్న ఈ వ్యూహాత్మక ఎయిర్‌బేస్ ఒక వారం పాటు అందుబాటులో ఉండదని చెప్పింది.
ఆ తర్వాత గత నెల నాలుగున రెండో నోటమ్ జారీ చేసింది. ఆ మూసివేతను జులై 4 వరకు పొడిగించింది. తాజాగా దానిని ఆగస్టు 5కు పెంచింది. భారత్ దాడులతో ఆ ఎయిర్‌బేస్ రన్‌వేపై పెద్ద గొయ్యి ఏర్పడినట్లు కొన్ని మీడియా చిత్రాలను బట్టి తెలుస్తోంది.దగ్గర్లోని ఒక భవనం కూడా ధ్వంసమైంది.ఈ స్థావరంలో షేక్ జాయెద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కూడా ఉంటుంది. దాంతో దీనిని పాక్ రెండు విధాలుగా ఉపయోగించుకుంటోంది. ఈ ఎయిర్‌బేస్‌తో పాటు మరో 10 మిలిటరీ సైట్లను కూడా భారత్ టార్గెట్ చేసింది. ఆ తర్వాతే పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఎయిర్‌బేస్ గురించి మన ప్రధాని మోదీ కూడా ప్రస్తావించారు. పాక్‌లోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస ్ఐసీయూలో ఉందని రాజస్థాన్‌లోని ఓ సభలో వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

# పాకిస్తాన్‌పై జలఖడ్గం

- 200 మంది మృతి, 560 మందికిపైగా గాయాలు





**టీపీఎన్, పాకిస్తాన్ :**
పాకిస్తాన్ లో భారీ వర్షాలు అల్లకల్లోలం సృష్టిస్తున్నాయి. గత కొన్ని రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షాలు, వరదలకు 200 మందికిపైగా చనిపోగా..560 మందికి గాయాలయ్యాయి. పాకిస్తాన్ పంజాబ్ లో 123 మంది , ఖైబర్ పఖ్తుంఖ్వాలో 40 , సింధ్‌లో 21, బలూచిస్తాన్‌లో 16, ఇస్లామాబాద్‌లో ఒకరు , పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లో మరొకరు చనిపోయారని అక్కడి అధికారులు తెలిపారు.

**రావల్పిండిలో ఆకస్మిక వరదలు**

రావల్పిండిలో ఆకస్మిక వరదలు ఇళ్ళు, వీధులు మార్కెట్లను ముంచెత్తాయి. లోతట్టు ప్రాంతాలన్నీ వరదనీటిలో మునిగిపోయాయి. భారీ వరదలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు ఫైసలాబాద్‌లో కూడా భారీ నష్టం జరిగింది. కేవలం రెండు రోజుల్లోనే 11 మంది మరణించగా, 60 మంది గాయపడ్డారు. భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోవడం వల్లే ఎక్కువ మరణాలు సంభవించాయి. వర్షాలు, వరదలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనేక ప్రాంతాల్లోని ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాకిస్తాన్ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (NDMA) తెలిపింది.





## గాల్లో విమానం.. ఇంజన్‌లో మంటలు..!

- సేఫ్‌గా ల్యాండింగ్ చేసిన పైలట్లు

**టీపీఎన్, అమెరికా :** లాస్ ఏంజిల్స్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అట్లాంటాకు వెళ్లే డెల్టా ఎయిర్ లైన్స్ విమానం DL446 టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. విమానాశ్రయం నుండి బయలుదేరిన వెంటనే దాని ఎడమ ఇంజిన్‌లో మంటలు చెలరేగినట్లు కనిపించింది. వెంటనే పైలట్లు గమనించి అత్యవసర పరిస్థితిని ప్రకటించి, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ATC)తో సమన్వయం చేసుకుని విమానాన్ని తిరిగి తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. వెంటనే విమానాన్ని లాస్ ఏంజిల్స్ ఎయిర్‌పోర్టులో అత్యవరంగా ల్యాండ్ చేశారు. దీంతో ప్రయాణికులందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**ప్రమాదంపై స్పందించిన డేల్టా**

మరోవైపు ఈ విమాన ప్రమాదంపై డేల్టా ప్రతినిధి స్పందించారు. డెల్టా విమానం 446 బయలుదేరిన కొద్దిసేపటికే విమానం ఎడమ ఇంజిన్‌లో సమస్య ఉన్నట్లు గుర్తించడంతో లాస్ ఏంజిల్స్‌కు తిరిగి వచ్చినట్టు పేర్కొన్నారు. ఫ్లైట్ ల్యాండ్ అయిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఇంజిన్ మంటలు ఆరిపేశారని తెలిపారు.ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. ఇదిలా ఉండగా అగ్ని ప్రమాదానికి గల కారణాన్ని తెలుసుకోవడానికి ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (FAA) దర్యాప్తు ప్రారంభించింది.



## సౌదీ స్లీపింగ్ ప్రిన్స్ మృతి

**టీపీఎన్ , ఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా 'స్లీపింగ్ ప్రిన్స్' గా ప్రసిద్ధి చెందిన సౌదీ యువరాజు అల్ వలీద్ బిన్ ఖలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ మరణించారు. దాదాపు 20 సంవత్సరాల క్రితం ఒక విషాదకరమైన కారు ప్రమాదంలో అతను కోమాలో ఉన్నాడు. అందుకే అతన్ని 'స్లీపింగ్ ప్రిన్స్' అని పిలుస్తారు.

**15 ఏళ్ల వయసులో జరిగిన ప్రమాదం**

1990లో జన్మించిన ప్రిన్స్ అల్ వలీద్, సౌదీ ప్రముఖ రాజకుటుంబ సభ్యుడు. బిలియనీర్ ప్రిన్స్ అల్ వలీద్ బిన్ తలాల్ మేనల్లుడు ప్రిన్స్ ఖలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ పెద్ద కుమారుడు ఆ దేశ మీడియా చెప్పింది. 2005లో, అల్ వలీద్ కు కేవలం 15 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, అతను లండన్‌లో మిలిటరీ క్యాడెట్‌గా చదువుతున్నప్పుడు , ఒక భయంకరమైన కారు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావం జరిగింది. దీని వల్ల మెదడులో రక్తస్రావం జరిగి అతను కోమాలోకి వెళ్ళాడు.

# 14 లక్షల కోట్లతో మెగా డ్యామ్

- ప్రారంభోత్సవానికి హాజరైన చైనా ప్రధాని లి కియాంగ్
- ఆందోళన వ్యక్తం చేస్తున్న భారత్, బంగ్లాదేశ్

**టీపీఎన్, బీజింగ్:** అరుణాచల్ ప్రదేశ్‌లోని భారత సరిహద్దుకు దగ్గరగా టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. దీని ఖర్చు US$167.8 బిలియన్ల వరకు ఉంటుందని అంచానా. భారత కరెన్సీలో 14 లక్షల కోట్లకుపైగా ఉంటుందని భావిస్తున్నారు నిపుణులు. ఆనకట్ట నిర్మాణాన్ని చైనా శనివారం అధికారికంగా ప్రారంభించింది. యార్లుంగ్ జాంగ్బో అని పిలువబడే బ్రహ్మపుత్ర నది దిగువ ప్రాంతంలోని నింగ్చి నగరంలో జరిగిన భూమి పూజ కార్యక్రమంలో చైనా ప్రధాన మంత్రి లీ కెకియాంగ్ ఆనకట్ట నిర్మాణాన్ని ప్రారంభించినట్లు ప్రకటించారు.

**ఆనకట్ట భూమి పూజ కార్యక్రమం**

టిబెట్ ప్రాంతంలోని నైయింగ్చిలోని మెయిన్లింగ్ జల విద్యుత్ కేంద్రం ఆనకట్ట స్థలంలో భూమి పూజ కార్యక్రమం జరిగిందని రాష్ట్ర వార్తా సంస్థ జిన్హువా నివేదించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా పరిగణించబడే ఈ జల విద్యుత్ ప్రాజెక్టు, దిగువ ప్రాంతాలు, భారతదేశం , బంగ్లాదేశ్‌లకు ఆందోళనలను రేకెత్తించింది.

భాతదేశం యొక్క ఆందోళనలు ఏమిటి?
ఆనకట్ట పరిమాణం, కొలతలు చైనాకు నీటి ప్రవాహాన్ని నియంత్రించే హక్కును ఇవ్వడమే కాకుండా, బీజింగ్ పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేయడానికి వీలు కల్పిస్తుందని.. ఇది యుద్ధ సమయాల్లో సరిహద్దు ప్రాంతాలను ముంచెత్తుతుందని భారతదేశంలో ఆందోళనలు ఉన్నాయి.





# స్టాక్ మార్కెట్ మోసాలు.. పంప్ అండ్ డంప్ స్కామ్ గురించి తెలుసా!

**టీపీఎన్, ముంబై :**

స్టాక్ మార్కెట్‌లో ఇటీవల కాలంలో పెట్టుబడులు చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే, ఈ పెరుగుదలతో పాటు స్టాక్ మార్కెట్ మోసాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల అమెరికాకు చెందిన ప్రముఖ గ్లోబల్ ఆల్గో ట్రేడింగ్ కంపెనీ జేన్ స్ట్రీట్ కేసు వార్తల్లో నిలిచింది. ఈ సంస్థ ఫ్యూచర్స్, ఆప్షన్స్ ముసుగులో వేల కోట్ల రూపాయలను పెట్టుబడిదారుల నుంచి మోసం చేసిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ మోసం పంప్ అండ్ డంప్ (Pump and Dump Scam) అనే స్కామ్ ద్వారా జరిగింది, దీనిలో పెద్ద ఇన్వెస్టర్లతో పాటు చిన్న పెట్టుబడిదారుల కష్టార్జిత డబ్బు కూడా దోచుకోబడింది.

**పంప్ అండ్ డంప్ స్కామ్ అంటే ఏమిటి?**

పంప్ అండ్ డంప్ అనేది స్టాక్ మార్కెట్‌లో చాలా కాలంగా కొనసాగుతున్న ఒక ఆర్థిక మోసం. ఈ స్కామ్‌లో స్కామర్లు మొదట తక్కువ ధర కలిగిన స్టాక్‌లను (పెన్నీ స్టాక్స్) లేదా చిన్న కంపెనీల షేర్లను ఎంచుకుంటారు. వీటిని భారీ మొత్తంలో కొనుగోలు చేసి, షేర్ల ధరను కృత్రిమంగా పెంచుతారు. ఆ తర్వాత, సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల ద్వారా ఈ స్టాక్‌ల గురించి తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తారు. ఈ ప్రచారం ద్వారా సామాన్య పెట్టుబడిదారులు ఆసక్తి చూపి, ఆ స్టాక్‌లలో పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తారు. దీంతో స్టాక్ ధర విపరీతంగా పెరుగుతుంది. ధర గరిష్ట స్థాయికి చేరిన వెంటనే, స్కామర్లు తమ షేర్లను విక్రయించి, భారీ లాభాలతో నిష్క్రమిస్తారు. ఫలితంగా, స్టాక్ ధర ఒక్కసారిగా పడిపోతుంది, దీంతో ఆ స్టాక్‌లో పెట్టుబడి పెట్టిన సామాన్య ఇన్వెస్టర్లు తమ డబ్బును కోల్పోతారు.

**ఈ స్కామ్ ఎలా పనిచేస్తుంది?**

ఉదాహరణకు, ఒక కంపెనీ షేరు ధర రూ. 2గా ఉంటే, స్కామర్లు లక్షల షేర్లను కొనుగోలు చేస్తారు. ఆ తర్వాత, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఫోరమ్‌లు లేదా స్టాక్ టిప్స్ పేరుతో గ్రూపుల ద్వారా ఈ స్టాక్ గురించి హైప్ సృష్టిస్తారు. ఈ కంపెనీ షేర్లు త్వరలో రూ. 20కి చేరుకుంటాయని తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తారు. ఈ ప్రచారాన్ని చూసిన పెట్టుబడిదారులు ఆ స్టాక్‌లో పెట్టుబడి పెట్టడం మొదలుపెడతారు. దీంతో షేరు ధర రూ. 5 నుండి రూ. 10 లేదా రూ. 20కి చేరుకుంటుంది. ఈ సమయంలో స్కామర్లు తమ షేర్లను విక్రయించి, భారీ లాభాలతో నిష్క్రమిస్తారు. వారి విక్రయం కారణంగా స్టాక్ ధర తిరిగి రూ. 2కు లేదా అంతకంటే తక్కువకు పడిపోతుంది. ఫలితంగా, సామాన్య పెట్టుబడిదారులు తమ కష్టార్జితాన్నిను కోల్పోతారు.

**ఈ స్కామ్ నుండి ఎలా రక్షించుకోవచ్చు?**

1.వివరణాత్మక పరిశోధన చేయండి: మీరు పెట్టుబడి పెట్టదలిచిన కంపెనీ గురించి పూర్తి సమాచారం తెలుసుకోండి. వారి ఆర్థిక స్థితి, మేనేజ్మెంట్, గత రికార్డు మొదలైనవన్నీ పరిశీలించండి.

2.తప్పుడు ప్రచారాలకు లోనవ్వకండి: సోషల్ మీడియా లేదా మెసేజింగ్ గ్రూపుల్లో వచ్చే హైప్, షార్ట్‌కట్ లాభాల వాగ్దానాలను నమ్మవద్దు.

3.సెబీ గుర్తింపు పొందిన సలహాదారులను సంప్రదించండి: పెట్టుబడులకు ముందు నిపుణుల సలహా తీసుకోవడం చాలా మంచిది. సెబీ గుర్తించిన ఫైనాన్షియల్ అడ్వైజర్లను సంప్రదించండి.


4.విభిన్న రంగాల్లో పెట్టుబడి పెట్టండి: ఒకే స్టాక్ లేదా రంగంలో కాకుండా, వివిధ రంగాల్లో పెట్టుబడులను విభజించడం ద్వారా రిస్క్ తగ్గించుకోవచ్చు.

స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు మంచి అవకాశాల వేదిక అయినప్పటికీ, అందులో జరుగుతున్న మోసాలను గుర్తించడంలో జాగ్రత్త అవసరం. సరైన అవగాహన, పరిశోధన, మరియు నిపుణుల మార్గదర్శకంతో మాత్రమే ఈ స్కాముల నుంచి దూరంగా ఉండటం సాధ్యమవుతుంది.

# ఈ వారం మార్కెట్‌లోకి రానున్న కొత్త కంపెనీలు ఇవే!

**టీపీఎన్, ముంబై :**

దేశీయ స్టాక్ మార్కెట్లో మళ్లీ ఐపీఓల వీక్ రానే వచ్చేసింది. గత కొన్ని వారాలుగా మార్కెట్లోకి కొత్త కంపెనీలు నిరంతరం వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఈసారి దాదాపు 10 కొత్త కంపెనీలు మార్కెట్లోకి వస్తున్నాయి. ఇదే సమయంలో మరికొన్ని కంపెనీలు కూడా ఎక్స్చేంజ్‌లో లిస్ట్ కానున్నాయి. ఆ విశేషాలేంటో ఇక్కడ చూద్దాం.



**ఈ వారం రానున్న కొత్త కంపెనీల IPOలు**

**ఇండిక్యూబ్ స్పేసెస్ ఐపీఓ:**
ఈ IPO పరిమాణం రూ. 700 కోట్లు కాగా, ఇందులో రూ. 650 కోట్ల తాజా ఇష్యూ, రూ. 50 కోట్ల OFS వాటా ఉన్నాయి. ఇండిక్యూబ్ స్పేసెస్ IPO ధర పరిధి ఈక్విటీ షేరుకు రూ.225 నుంచి రూ. 237 వరకు నిర్ణయించారు. దీని ముఖ విలువ రూ.1గా నిర్ణయించారు.

**GNG ఎలక్ట్రానిక్స్ IPO:**
ఈ IPO పరిమాణం రూ.460 కోట్లు. ఇందులో రూ.400 కోట్ల తాజా ఇష్యూ, రూ.60 కోట్ల OFS ఉన్నాయి. GNG ఎలక్ట్రానిక్స్ IPO ధర ఈక్విటీ షేరుకు రూ. 225 నుంచి రూ. 237గా ప్రకటించారు. దీని ముఖ విలువ రూ. 2.

**సావీ ఇన్‌ఫ్రా & లాజిస్టిక్స్ IPO:**
రియల్ ఎస్టేట్, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిన సావీ ఇన్‌ఫ్రా, రూ. 69.98 కోట్ల IPOను ప్రారంభిస్తోంది. ఈ ఆఫర్ జూలై 21 నుంచి జూలై 23 వరకు అందుబాటులో ఉంటుంది. దీని ధర రూ. 114 నుంచి రూ. 120 వరకు ఉంది.

**స్వస్తిక్ కాజిల్ IPO:**
ఇంజనీరింగ్ విడిభాగాల తయారీ సంస్థ స్వస్తిక్ కాజిల్, ఒక్కో షేరుకు రూ. 65 ధరతో రూ. 14.07 కోట్ల IPOతో వస్తుంది. ఇది 21.64 లక్షలకు పైగా షేర్లను జారీ చేయనుంది. హారిజన్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ స్వస్తిక్ కాజిల్ IPOకి లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తుంది.

**మోనార్క్ సర్వేయర్స్ & ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ IPO:**
ఈ కంపెనీ జూలై 22న తన IPOను ప్రారంభించనుంది. ఈ ఇష్యూ ద్వారా రూ. 93.75 కోట్లు సేకరించాలనే లక్ష్యంతో ఉంది. ఈ IPO ఇష్యూ ధర రూ. 237 నుంచి రూ. 250 మధ్య ఉంటుంది.

**TSC ఇండియా IPO:**
టెక్నాలజీ, సర్టిఫికేషన్ సేవలను అందించే కంపెనీ TSC ఇండియా, రూ. 68 నుంచి రూ. 70 ధరల శ్రేణితో రూ. 25.89 కోట్ల IPOను ప్రారంభించనుంది. TSC ఇండియా లిమిటెడ్ అనేది క్లయింట్‌లకు ఎయిర్ టికెటింగ్ సేవలను అందించే ట్రావెల్ మేనేజ్‌మెంట్ సంస్థ.

**పటేల్ కెమ్ స్పెషాలిటీస్ IPO:**
ఈ కంపెనీ జూలై 25న రూ. 58.80 కోట్ల IPOను ప్రారంభించి, జూలై 29న ముగుస్తుంది. ఈ ఇష్యూ ధర పరిధి రూ. 82 నుంచి రూ. 84 మధ్య ఉంటుంది. పటేల్ కెమ్ స్పెషాలిటీస్ లిమిటెడ్ (PCSL) ఔషధ ఎక్సిపియెంట్లు, స్పెషాలిటీ కెమికల్స్ ఉత్పత్తి, ఎగుమతుల్లో ప్రాముఖ్యత కలిగి ఉంది.

**ప్రాప్‌షేర్స్ టైటానియా IPO:**
ప్రాపర్టీ షేర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (REIT) రెండో స్కీం అయిన టైటానియా, జూలై 21న సబ్‌స్క్రిప్షన్ కోసం రూ. 473 కోట్ల IPOను ప్రారంభించనుంది. జూలై 25న ముగిసే ఈ IPO ధర బ్యాండ్ రూ. 1010.6 లక్షలుగా నిర్ణయించబడింది.

**బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ IPO:**
ఈ IPOలో రూ. 759.60 కోట్ల విలువైన కొత్త షేర్లు జారీ చేయనున్నారు. ఈ IPO ధరను మరికొన్ని రోజుల్లో ప్రకటించబడే అవకాశం ఉంది. ఈ ఇష్యూకు ప్రధాన నిర్వాహకులు JM ఫైనాన్షియల్ లిమిటెడ్, ICICI సెక్యూరిటీస్ లిమిటెడ్, రిజిస్ట్రార్ KFin టెక్నాలజీస్ లిమిటెడ్.

**శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ IPO:**
ఈ IPOలో 1,80,96,000 ఈక్విటీ షేర్ల తాజా ఇష్యూ ఉంది. ఆఫర్‌ఫర్‌సేల్ (OFS) లేదు. శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ IPO ధరలు కూడా మరికొన్ని రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్ IPO కోసం ఛాయిస్ క్యాపిటల్ అడ్వైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ బుక్‌రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తుంది. బిగ్‌షేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఇష్యూ రిజిస్ట్రార్‌ను నిర్వహించడానికి బాధ్యత వహిస్తుంది.

# పతంజలి ఫుడ్స్ బోనస్ షేర్ల ప్రకటన.. ఇన్వెస్టర్లకు పెద్ద శుభవార్త!


**టీపీఎన్, ముంబై :**

మీరు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెడుతున్నారా? అయితే మీకో మంచి వార్త! మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, సరైన సమయంలో సరైన స్టాక్ ఎంపిక చేస్తే, దీర్ఘకాలికంగా మంచి లాభాలు సాధించవచ్చు. అయితే, మార్కెట్‌లో లాభాలు కేవలం షేరు ధరలు పెరగడం వల్ల మాత్రమే కాదని, కొన్నిసార్లు కంపెనీలు ప్రకటించే బోనస్ షేర్లు, డివిడెండ్లు, స్టాక్ స్ప్లిట్‌లు, షేర్ బైబ్యాక్‌లు వంటి ప్రకటనలు కూడా పెట్టుబడిదారులకు ఆకర్షణీయ లాభాలను అందిస్తాయని చెప్పాలి.

ఇలాంటి నేపథ్యంలో ప్రముఖ FMCG కంపెనీ పతంజలి ఫుడ్స్ తమ వాటాదారులకు శుభవార్త అందించింది. కంపెనీ బోర్డు 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయాలని నిర్ణయించింది. అంటే, ప్రతి షేరుకు అదనంగా రెండు ఉచిత షేర్లు లభించనున్నాయి. ఉదాహరణకు, ఒక పెట్టుబడిదారుని వద్ద 100 పతంజలి ఫుడ్స్ షేర్లు ఉంటే, అతనికి అదనంగా మరో 200 బోనస్ షేర్లు ఉచితంగా అందిస్తారు.

ఇది పతంజలి ఫుడ్స్ చరిత్రలో మొదటిసారి బోనస్ షేర్లను ప్రకటించడం కావడం విశేషం. ఈ ప్రకటన పతంజలి ఫుడ్స్ పై నమ్మకంగా ఉన్న ఇన్వెస్టర్లకు నిజమైన ఉత్సాహాన్ని కలిగించనుంది. ఇటువంటి నిర్ణయాలు సంస్థ దృఢమైన ఆర్థిక స్థితిని సూచించడమే కాక, పెట్టుబడిదారుల పట్ల కంపెనీ నిబద్ధతను కూడా సూచిస్తాయి.

ఇన్వెస్టర్లకు ఇది ఒక గొప్ప అవకాశమే - అదనపు పెట్టుబడి లేకుండానే అధిక లాభాల కోసం ఒక మెరుగైన మార్గం!




# మదుపరులూ జాగ్రత్త!


**టీపీఎన్, ముంబై :**

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశముంది. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత వచ్చేంత వరకు ఊగిసలాట తప్పకపోవచ్చు. మరోవైపు జియో పొలిటికల్ పరిణామాలూ కీలకంగా మారుతున్నాయి. నిఫ్టీ సైతం 25000 దిగువకు రావడం నెగటివ్ సెంటిమెంటును ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే సూచీలు చాలా నష్టపోవడంతో ఏదేమైనా సానుకూల సంకేతాలు వస్తే బౌన్స్‌బ్యాక్ అవ్వొచ్చు. ఏదేమైనా మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

**స్టాక్ రికమెండేషన్స్**

విప్రో: ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డౌన్‌ట్రెండులో పయనిస్తున్న ఈ షేర్లు ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతున్నాయి. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ ఫర్వాలేదు. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత దీనిపై ఆసక్తి పెరిగింది. గత శుక్రవారం రూ.266 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.290 టార్గెట్ ధరతో రూ.260 వద్ద పొజిషన్ తీసుకోవాలి. రూ.256 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.


**ఐసీఐసీఐ బ్యాంకు:**
ప్రస్తుతం ఈ షేర్లు జీవితకాల గరిష్ఠ స్థాయుల్లో చలిస్తున్నాయి. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ లేనప్పటికీ తాజా త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఆసక్తి పెరిగింది. 20, 50 రోజులు మూవింగ్ యావరేజెస్ వద్దే షేర్లు కన్సాలిడేట్ అవుతున్నాయి. గత శుక్రవారం రూ.1425 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1400 శ్రేణిలో బయ్ ఆన్ డిప్స్ పద్ధతిలో కొనుగోలు చేయాలి. టార్గెట్ రూ.1480/1530. స్టాప్‌లాస్ 1375.




**బజాజ్ ఫైనాన్స్:**
నష్టాల మార్కెట్లోనూ ఈ షేర్లు బలం ప్రదర్శిస్తున్నాయి. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా మెరుగవుతున్నాయి. టైట్ రేంజులో కన్సాలిడేట్ అవుతున్నాయి. గత శుక్రవారం రూ.942 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.980 / 1050 టార్గెట్ ధరతో రూ.910/900 శ్రేణిలో కొనుగోలు చేయాలి. రూ.880 వద్ద స్టాప్‌లాస్ తప్పనిసరి.

**టాటా కన్జూమర్:**
ప్రస్తుతం ఈ షేర్లు స్థిరంగా చలిస్తున్నాయి. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1095 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1700/1720 స్థాయిలో ప్రవేశించాలి. టార్గెట్ ధర రూ. 1840. స్టాప్‌లాస్ రూ. 1680.

**ఎన్ఎండీసీ:**
ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ షేర్లు సైడ్‌వేస్‌లో చలిస్తున్నాయి. ప్రస్తుతం అక్యూములేషన్ దశ కొనసాగుతోంది. ఎఫ్ఐఐలు తమ వాటాను పెంచుకున్నారు. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.71 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.82 టార్గెట్ ధరతో రూ.70 వద్ద పొజిషన్ తీసుకోవాలి. రూ.67 వద్ద స్టాప్‌లాస్ ఉంచుకోవాలి.



మూర్తి నాయుడు పాదం
నిఫ్ట్ మాస్టర్
స్టాక్ మార్కెట్ అనలిస్ట్
+91 988 555 9709

# వేధింపులపై ఏఐ గురి



అన్నిరంగాల్లో తనదైన ముద్రవేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్.. మహిళలకూ అండగా నిలుస్తున్నది. ఆఫీసుల్లో వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుంది. సమస్యను గుర్తించడం, నిరోధించడంతో పాటు పరిష్కరించడంలోనూ హెల్ప్ చేస్తుంది. ఏళ్లకేళ్లుగా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. కార్యాలయాల్లో మహిళలపై వేధింపులు తగ్గడం లేదు. కౌన్సెలింగ్‌లు, శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ.. వేధింపులు నిరంతర సమస్యగా కొనసాగుతున్నాయి. అయితే, ఈ విషయంలో బాధితుల్లో చాలామంది మౌనంగానే ఉండిపోతున్నారు. పరువు పోతుందనీ, కెరీర్ ఇబ్బందిలో పడుతుందని కంప్లైంట్స్ చేయడానికి భయపడుతున్నారు. ధైర్యంగా ఫిర్యాదు చేసినా.. న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉండటం లేదు. ఈ సమస్యకు.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మంచి పరిష్కారం చూపుతుందని టెక్నికల్ నిపుణులు చెబుతున్నారు. ఈ విషయంలో నెమ్మదిగా, పక్షపాతంగా సాగే మానవ జోక్యంపై ఆధారపడటానికి బదులుగా..ఏఐతో తక్షణ న్యాయం పొందొచ్చని అంటున్నారు. ఇప్పటికే ఉమ్‌వెల్ట్.ఏఐ రూపొందించిన ఏఐ ఆధారిత చీఫ్ లైజనింగ్ ఆఫీసర్ నిక్కీ.. కార్యాలయాల్లో వేధింపులపై నివేదికలు ప్లాన్ చేస్తున్నారు. ఉద్యోగుల మనోభావాలను మానిటర్ చేయడంతో పాటు మహిళల అభిప్రాయాలనూ సేకరిస్తుంది. ఈ మెయిల్స్ చెక్ చేయడం, చాట్ సెషన్లను స్కాన్ చేయడం ద్వారా.. ఎవరైనా వేధింపులకు గురవుతున్నారా అని గుర్తిస్తుంది. వేధింపుల కేసుల్లోని అతి పెద్ద సమస్యలు.. రిపోర్టింగ్, పక్షపాతం. చాలాచోట్ల ఉన్నతోద్యోగులు తనవాళ్లకు అండగా నిలుస్తుంటారు. కానీ, ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్.. ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారిస్తుంది. జెండర్, డిపార్ట్ మెంట్, సీనియారిటీ లాంటి గుర్తింపులను తొలగిస్తుంది. కేసులను వాస్తవాల ఆధారంగా రివ్యూ చేస్తుంది. తద్వారా బాధితులకు న్యాయం జరుగుతుంది. ప్రతీకార భయంతో వేధింపులపై కంప్లైంట్ చేయడానికి చాలామంది ముందుకు రావడంలేదు. అయితే, ఏఐ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్లు.. ఫిర్యాదుదారుల వివరాలను సీక్రెట్ గా ఉంచుతాయి. బాధితులకు కావాల్సిన చట్టపరమైన సలహాలను అందిస్తాయి. వారి మానసిక స్థితి మెరుగుపడేందుకు కావాల్సిన కౌన్సెలింగ్ కూడా ఇప్పిస్తాయి. మరికొన్ని మోడరన్ ఏఐ వ్యవస్థలు.. ఉద్యోగుల్లో అనుచిత ప్రవర్తననూ గుర్తిస్తున్నాయి. ఇబ్బందికరంగా ప్రవర్తించేవారిపై ఓ కంట కనిపెడుతున్నాయి. అలాంటి వారిపై ఫిర్యాదులు అందితే.. తక్షణమే తగిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం ఈ ఏఐ సేవలు మహిళలకు ఎంతో హెల్ప్ అవుతున్నాయని అంటున్నారు.



# కీమోథెరపీ ద్వారా క్యాన్సర్ వ్యాప్తి?

క్యాన్సర్ బారిన పడిన వారికి కీమోథెరపి ట్రీట్‌మెంట్ అందిస్తుంటారు డాక్టర్లు. అయితే ఈ కీమోథెరపీ ద్వారా క్యాన్సర్ మరిన్ని అవయవాలకు వ్యాప్తి చెందే అవకాశం ఉందని చైనా శాస్త్రవేత్తల టీమ్ గుర్తించింది. క్యాన్సర్ కణితి సమస్య ఇతర అవయవాలకు వ్యాప్తిచెందడం, ఇతర అవయవాల్లో క్యాన్సర్ కణాలు యాక్టివ్ అవుతాయని తెలిపారు. చికిత్స తర్వాత రొమ్ము క్యాన్సర్ పేషెంట్లు కోలుకున్నప్పటికీ వారి ఊపిరితిత్తులు లాంటి ఇతర అవయవాలలో క్యాన్సర్ మెటాస్టాసిస్ కనిపించడంపై రీసెర్చ్ జరిగింది. కీమోథెరపీలో కొన్ని ఇతర ఔషధాలు కలిపి వాడకం ద్వారా ఇతర అవయవాలకు క్యాన్సర్ వ్యాప్తి జరగకుండా ప్రయోగాలు చేస్తున్నారు. ఎలుకలలో, రొమ్ము క్యాన్సర్ రోగులలో క్లినికల్ ట్రయల్ కొనసాగుతున్నాయి. డోక్సోరోబిసిన్, సిస్ప్లాటిన్ తో సహా కెమోథెరపిటిక్ మెడిసిన్ యాక్టివ్ గా లేని రొమ్ము క్యాన్సర్ కణాలు వ్యాప్తి చెందుతాయి. ఊపిరితిత్తుల మెటాస్టాసిస్ ను ఇవి పెంచుతాయని చైనా సైంటిస్ట్ టీమ్ ఈ విషయాన్ని తెలిపింది. చైనా నిపుణుల ప్రకారం ఇన్ యాక్టివ్ క్యాన్సర్ సెల్స్ నుంచి క్యాన్సర్ కణాలు యాక్టివ్ కావడానికి ఆధారాలను అందిస్తుంది. మెటాస్టాసిస్ పై కెమోథెరపీ హానికరమైన ప్రభావం చూపుతుంది. క్యాన్సర్ చికిత్సను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని ఇది సూచిస్తుంది. క్యాన్సర్ చికిత్సలో రేడియేషన్ థెరపీ అధికంగా చేయడం మెటాస్టాటిక్ కణితుల పెరుగుదలకు దారితీస్తాయని అమెరికా రీసెర్చర్స్ గతంలో కనుగొన్నారు. ప్రాథమిక కణితులకు చికిత్స చేయడానికి కీమోథెరపీ చేయించుకున్న పేషెంట్లలో అసలు కణతి నుంచి కోలుకుంటున్నారు. కానీ ఇతర అవయవాలలో క్యాన్సర్ కణాలు వ్యాప్తి చెందుతున్నాయి. దాంతో కెమోథెరపీ ద్వారా ఇదే సమస్య తలెత్తుతుందా అని పరిశోధన మొదలైంది. క్యాన్సర్ మెటాస్టాసిస్ ను ప్రేరేపిస్తుందని చైనా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. క్యాన్సర్ కణతి గుర్తించిన టైమ్ లో ఇతర భాగాల్లోనూ కణతులు ఉంటాయి. కానీ అవి స్లీపింగ్ స్టేట్ లో ఉండి, పెరగవు. కానీ కీమోథెరపి ద్వారా అవి యాక్టివ్ అవుతాయి. డిటిసి క్యాన్సర్ కణాల వ్యాప్తి అర్థం చేసుకుంటే ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్న వారికి మెరుగైన చికిత్స అందించవచ్చు. షాంఘై ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ హెల్త్ ప్రొఫెసర్ టీమ్ క్యాన్సర్ కణాల ట్రేసింగ్ విధానాన్ని కనుగొన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ పేషెంట్లు కీమోథెరపి చేయించుకుంటే ఊపిరితిత్తులలో క్యాన్సర్ కారకాలు, కణతులు యాక్టివ్ అవుతున్నాయని రీసెర్చ్ టీమ్ తెలిపింది. ట్రీట్మెంట్ ద్వారా వేగంగా వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి. ఇది ఊపిరితిత్తుల్లో నిద్రాణమైన క్యాన్సర్ కణాలను యాక్టివ్ చేస్తుంది. కొత్త కణతి పెరిగే అవకాశం ఉంది. మెటాస్టాసిస్ నిరోధంపై కెమోథెరపీ ప్రభావాన్ని మెరుగుపరచడానికి అన్వేషించారు. సెనోలైటిక్ ఔషధాలను కలపడంతో ఇది సెనెసెంట్ కణాలను తొలగిస్తుంది. కెమోథెరపీ డ్రగ్ డోక్సోరోబిసిన్ ఎలుకల ఊపిరితిత్తులలో సెనెసెంట్ ఫైబ్రోబ్లాస్టను తగ్గించినట్లు రీసెర్చర్లు కనుగొన్నారు. దీనిపై క్లినికల్ ట్రయల్స్ జరగాలని కోరారు. ఈ అధ్యయన ఫలితాలతో ట్రిపుల్‌నెగటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ ట్రీట్ మెంట్ కు కెమోథెరపీలో సెనోలైటిక్ డ్రగ్స్ దాసాటినిబ్, క్వెర్సెటిన్లను కలపాలని ఫేజ్ II క్లినికల్ ట్రయల్ జరగనుంది. ట్రిపుల్ నెగటివ్ రొమ్ము క్యాన్సర్ అనేది వ్యాధి దూకుడు రూపం. ఇలాంటి రకం క్యాన్సర్లకు సాధారణ హార్మోన్ చికిత్స చేయకూడదని చైనా సైంటిస్టులు తెలిపారు.

# షైనింగ్ టీచర్ ప్రత్యేకతలు ఇవే..



మంచి చేయాలన్న సంకల్పం ఉంటే ఏదీ అసాధ్యం కాదని నమ్ముతారు దుర్గా భవాని. అయిదేళ్లు పెనమలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేశారు. ఇప్పుడు ప్రైవేటు స్కూళ్లలోనే బెస్ట్ ఎడ్యుకేషన్ దొరుకుతుందన్న నమ్మకం అందరిదీ. ఆ అభిప్రాయాన్ని మార్చడానికి తల్లిదండ్రులు, విద్యార్థులకు నిరంతరం కౌన్సెలింగ్ నిర్వహించేవారామె. అలా వారి నమ్మకాన్ని సాధించారు. కేవలం పాఠాలకే పరిమితం కాలేదు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలకు వారే పరిష్కారాలు కనుక్కునేలా ఎంకరేజ్ చేశారు. దాని ఫలితమే తడిచిన ధాన్యం ఆరబోసే యంత్రం, పాఠశాలలో చెత్తను శుభ్రం చేసేందుకు పాత వస్తువుల నుంచి బ్లోయర్, ఆల్కహాల్ సెన్సింగ్ హెల్మెట్... ఇలా ఎన్నో ఆవిష్కరణలు ఇక్కడ రూపొందాయి. దీనికోసం రోజూ సాయంత్రం రెండు గంటల సమయాన్ని కేటాయించారు. విద్యార్థులకు సాయం చేయడానికి స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీనీ ఏర్పాటు చేశారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ ద్వారా వాల్ ఆర్ట్, డ్యాన్స్, మ్యూజిక్ తరగతులు, కంప్యూటర్ శిక్షణ వంటివీ అందించారు. దుస్తులు కుట్టడంలోనూ శిక్షణివ్వడంతో విద్యార్థులే వాళ్ల యూనిఫామ్ లు కుట్టుకుంటున్నారు. విద్యార్థులు తయారుచేసిన వస్తువులను పేరెంట్‌టీచర్ మీటింగ్ సమయంలో అమ్మకానికి ఉంచేవారు. వాటిని మెచ్చి తల్లిదండ్రులే కొనడానికి ఆసక్తి చూపించేవారు. సదుపాయాల కోసం దాతల సాయం కోరారు. అలా ఆ కొరతనీ తీర్చారు. ఇవన్నీ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ఫలితమే... ఈ ఏడాది పదోతరగతిలో 54 మంది విద్యార్థులు.. 500కు పైగా మార్కులు సాధించారు. ఏడుగురు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు పొందారు. రాష్ట్రంలోనే తొలిసారిగా తమ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేనీ నిర్వహించారామె. పేదవాళ్లే ప్రభుత్వ పాఠశాలలకు వస్తారన్న భావన మారాలి. విద్యార్థులు నేర్చుకున్నది పూర్తి స్థాయిలో అవగాహన చేసుకోగలగాలి. ఆచరణలో పెట్టాలి. అప్పుడే ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ విధానాన్నే అనుసరించాం. ఫలితాలూ రాబట్టగలిగాం అంటారు దుర్గాభవాని. దుర్గాభవాని సేవలు, తన ఆధ్వర్యంలో సాధించిన ఫలితాలను గుర్తించిన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆమెను అభినందించారు.

# కొత్త ఫోన్ లాంచ్ అనౌన్స్ చేసిన లావా

ఇండియాస్ మోస్ట్ పాపులర్ మొబైల్ తయారీ కంపెనీ లావా అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ లాంచ్ ను రీసెంట్ గా అనౌన్స్ చేసింది. బ్లేజ్ డ్రాగన్ పేరుతో ఈ స్మార్ట్ ఫోన్ ను లాంచ్ చేస్తోంది. అంతేకాదు, ఈ ఫోన్ కు ఈ పేరెందుకు పెట్టామో చెప్పండి అంటూ టీజింగ్ కూడా మొదలు పెట్టింది. ఈ ఫోన్ ను అమెజాన్ ద్వారా టీజింగ్ చేస్తోంది అండ్ కంపెనీ అఫీషియల్ X అకౌంట్ నుంచి ఈ అప్ కమింగ్ ఫోన్ టీజర్ వీడియో కూడా రిలీజ్ చేసింది. లావా డ్రాగన్ స్మార్ట్ ఫోన్ ను జూలై 25వ తేదీ మధ్యాహ్నం లాంచ్ చేస్తున్నట్లు లావా లాంచ్ డేట్ అనౌన్స్ చేసింది. ఈ ఫోన్ ను లావా బ్లేజ్ సిరీస్ నుంచి లాంచ్ చేస్తోంది. ఈ ఫోన్ అమెజాన్ ఇండియా నుంచి టీజ్ అవుతోంది అండ్ ప్రత్యేకమైన టీజర్ పేజి కూడా అందుకుంది. కంపెనీ ఈ ఫోన్ ను రైజ్ ఆఫ్ ది ఇండియన్ డ్రాగన్ హ్యాష్ ట్యాగ్ తో టీజ్ చేస్తోంది. లావా ఈ అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ టీజర్ వీడియో రిలీజ్ చేసింది. ఈ టీజర్ వీడియో ద్వారా ఈ ఫోన్ యొక్క కొన్ని స్పెక్స్ బయటకు తెలుస్తున్నాయి. ఈ అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ రౌండ్ కార్నర్ కలిగిన సన్నని డిజైన్ లో ఉన్నట్లు కనిపిస్తోంది. ఇందులో, డ్రాగన్ చిప్ సెట్ ఉన్నట్లు టీజ్ చేస్తోంది. ఈ హింట్ చూస్తుంటే ఈ అప్ కమింగ్ ఫోన్ ను లేటెస్ట్ స్నాప్ డ్రాగన్ చిప్ సెట్ తో లాంచ్ చేసే అవకాశం ఉండవచ్చు అని భావిస్తున్నారు. అయితే, లావా ఈ ఫోన్ కు డ్రాగన్ అనే పేరు ఎందుకు పెట్టామో కనిపెట్టండి? అంటూ టీజింగ్ చేస్తుండటంతో ఇది మరింకేదైనా కొత్త చిప్ సెట్ అవుతుందా? అనే అనుమానం కూడా వ్యక్తం అవుతోంది. ఈ విషయం పక్కన పెడితే, ఈ అప్ కమింగ్ ఫోన్ లో 50MP డ్యూయల్ రియర్ కెమెరా సెటప్ ఉన్నట్లు కన్ఫర్మ్ అయ్యింది. అంతేకాదు, ఇందులో, ఫోన్ అడుగున టైప్ C పోర్ట్, స్పీకర్ గ్రిల్ మరియు 3.5mm జాక్ పోర్ట్ ఉన్నట్లు చూపించింది. ఈ లావా అప్ కమింగ్ స్మార్ట్ ఫోన్ వచ్చే వారం లాంచ్ అవుతుంది కాబట్టి ఈ ఫోన్ లాంచ్ కంటే ముందే ఈ ఫోన్ కీలక ఫీచర్లు కూడా లావా టీజింగ్ ద్వారా అందించే అవకాశం ఉంటుంది.




# ఆస్పత్రికి వచ్చిన యువతి.. స్కాన్ తీస్తే..

ప్రస్తుత పరిస్థితుల రీత్యా ఎవరికి ఎలాంటి సమస్యలు వస్తున్నాయో ఎవ్వరికీ అర్థమే కావట్లేదు. ఆఖరికి కొన్ని పరిస్థితులు వైద్యులకు కూడా అర్థం కాక షాక్ కి గురవుతున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కౌశాంబి జిల్లాకు చెందిన 21 ఏళ్ల యువతి ఓ అరుదైన మానసిక రోగం కారణంగా ప్రాణాలు కోల్పోయే ప్రమాదంలో చిక్కుకుంది. చిన్ననాటి నుంచే జుట్టు తినే అలవాటు పెంచుకున్న ఆమె కడుపులో 1.5 అడుగుల పొడవైన భారీ జుట్టు బంతి ఏర్పడింది. వికారమైన అలవాటు కారణంగా ఆ జుట్టు కడుపులో పేరుకుపోయి ట్రికోబీజోర్ అనే పరిస్థితికి దారితీసింది. దాంతో యువతికి కడుపునొప్పి, వాంతులు, బలహీనత, ఆకలి లేకపోవడం మొదలయ్యాయి. అయితే, ఆమె పలుచోట్ల స్కాన్లు, పరీక్షలు చేయించుకున్నా.. అసలు కారణం ఏంటనేది ఎవరూ గుర్తించలేకపోయారు. రీసెంట్ గా ఆమెను ప్రయాగ్‌రాజ్‌లోని నారాయణ స్వరూప్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ డాక్టర్లు పూర్తి చెకప్ చేసిన తర్వాత కడుపులో హెయిర్ బాల్ ఉన్న విషయం గుర్తించి.. వెంటనే శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. డాక్టర్ రాజీవ్ సింగ్, డాక్టర్ విషాల్ కేవలాని, డాక్టర్ యోగేంద్ర, డాక్టర్ రాజ్ మౌర్యల టీమ్ కలిసి రెండు గంటలపాటు శస్త్రచికిత్స జరిపారు.




కడుపు ఓపెన్ చేయగా 1.5 అడుగుల పొడవు, 10 సెం.మీ వెడల్పు, సుమారు 500 గ్రాముల బరువు ఉన్న హెయిర్ బాల్ కనిపించింది. దాన్ని జాగ్రత్తగా తీసి, పేగులన్నీ శుభ్రం చేసి, దెబ్బతిన్న భాగాలకు చికిత్స చేశారు. ఈ యువతికి ట్రికోఫేజియ అనే అరుదైన మానసిక రుగ్మత ఉంది. ఈ వ్యాధితో బాధపడే వాళ్లు జుట్టు, మట్టి, గాజు వంటివి తినే అలవాటు కలిగిఉంటారు. చిన్నప్పటి నుంచి తన జుట్టు, కొన్నిసార్లు ఇతరుల జుట్టూ ఆమె తినేదని.. ఆ జుట్టు కడుపులో ఓ బాల్ షేప్ లో పేరుకుపోయిందని వైద్యులు తెలిపారు. ఈ హెయిర్ బాల్ సమయానికి తీసేయకపోతే.. పేగుల్లో అడ్డంకులు ఏర్పడి.. లోపల విష పదార్థాలు పేరకుపోయి.. జీర్ణ క్రియ వైఫల్యం, చివరికి మరణం కూడా సంభవించేదట. ప్రస్తుతం ఆ యువతి ఆరోగ్యంగా ఉంది. ఆహారం సాధారణంగా తీసుకుంటోంది. అయితే మళ్లీ ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు ఆమెకు మానసిక వైద్యం అందిస్తున్నారు. అయితే ఈ కేస్ గురించి డాక్టర్లు మాట్లాడుతూ.. ఇలాంటి కేసులను తాము అరుదుగా చూస్తామని, అయితే పరిశీలించిన వెంటనే చికిత్స అవసరమని చెబుతున్నారు.




# డబ్ల్యూటీసీ ఫైనల్స్ పై కీలక నిర్ణయం

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ ఆతిథ్యంపై ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మూడుసార్లు టెస్టు సమరాన్ని నిర్వహించిన ఇంగ్లండ్ బోర్డుకే పట్టం కట్టింది ఐసీసీ. వచ్చే సీజన్ ఒక్కటే కాదు మరో రెండు ఫైనల్స్ బాధ్యతను కూడా ఈసీబీకే రాసిచ్చింది. 2027, 2029, 2031 టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్స్ కు ఈసీబీనే ఆతిథ్యం ఇవ్వనుంది. గత మూడు సీజన్ల డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఇంగ్లండ్ లోనే జరిగాయి. దాంతో.. ఈసీబీకి అధిక ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదని.. వచ్చే సీజన్లకు వేదికను మారిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కానీ, ఈసీబీ అత్యంత పకడ్బందీగా ఈ మ్యాచ్‌లను ఆర్గనైజ్ చేసింది. అంతేకాదు అక్కడి ప్రేక్షకులు ఐదు రోజుల మ్యాచ్ ను చూసేందుకు భారీగా తరలివచ్చారు కూడా. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న ఐసీసీ.. డబ్ల్యూటీసీ టైటిల్ పోరును సమర్థంగా నిర్వహించిందినందున.. వేదికను మార్చడం సరైంది కాదని అనుకుంది. దాంతో.. 2027 ఫైనల్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశ పడిన బీసీసీఐకి డిస్టర్బెన్స్ ఎదురైంది. ఐసీసీ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఇంగ్లండ్ బోర్డు సంతోషం వ్యక్తం చేసింది. టీ20లు.. ఫ్రాంచైజీ క్రికెట్‌ల విస్తరణతో కళ తప్పుతున్న సుదీర్ఘ ఫార్మాట్ కు ఐసీసీ 201921లో టెస్టు ఛాంపియన్ షిప్ ను తెరపైకి తీసుకొచ్చింది. ఫస్ట్ ఎడిషన్ ను ఇంగ్లండ్‌లోని సౌతాంప్టన్ మైదానంలో నిర్వహించారు. భారత్‌ను ఓడించిన న్యూజిలాండ్ మొట్టమొదటి ఛాంపియన్‌గా అవతరించింది. రెండో సీజన్ ఫైనల్ కూడా ఇంగ్లండ్‌లోనే. ఈసారి కూడా రిజల్ట్ మారలేదు. ఓవల్ స్టేడియంలో టీమిండియాను 209 పరుగుల తేడాతో చిత్తు చేసి ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది

# పాకిస్తాన్ తో మ్యాచ్.. శిఖర్ ధవన్ వ్యాఖ్యలు



పహల్గాం ఉగ్రదాడి తర్వాత బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పాకిస్థాన్ జట్టుతో ఏ తరహా క్రికెట్‌నూ ఆడకూడదని నిర్ణయించుకున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం ఇంగ్లండ్ వేదికగా వరల్డ్ ఛాంపియన్‌షిప్ అఫ్ లెజెండ్స్ టోర్నీ జరుగుతోంది. ఈ టోర్నీలో పలు దేశాలకు చెందిన మాజీ క్రికెటర్లు ఆడుతున్నారు. టీమిండియాకు మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ నాయకత్వం వహిస్తున్నాడు. ఈ టోర్నీలో భాగంగా ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఆదివారం పాకిస్థాన్, భారత్ మ్యాచ్ జరగాల్సి ఉంది. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడకూడదని భారత మాజీ క్రికెటర్లు నిర్ణయించుకోవడంతో ఆదివారం జరగాల్సిన మ్యాచ్‌ను డబ్ల్యూసీఎల్ రద్దు చేసింది. ఎడ్జ్‌బాస్టన్ స్టేడియం వద్దకు అభిమానులు ఎవరూ రావొద్దని, టికెట్ డబ్బులను పూర్తిగా రీఫండ్ చేస్తామని ఓ ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు. దీంతో ఈ టోర్నీలో ఇరు జట్లకు చెరో పాయింట్ లభించబోతున్నట్టు టాక్. కాగా, ఈ మ్యాచ్‌లో తాను ఆడేది లేదని మే 11వ తేదీనే నిర్వాహకులకు చెప్పినట్టు మాజీ క్రికెటర్ శిఖర్ ధవన్ తెలిపాడు. డబ్ల్యూసీఎల్ లీగ్‌లో పాకిస్థాన్‌తో జరగాల్సిన మ్యాచ్‌లో ఆడకూడదని నేను గతంలోనే నిర్ణయించుకున్నా. ఈ మేరకు మే 11వ తేదీన డబ్ల్యూసీఎల్ నిర్వాహకులకు నా నిర్ణయాన్ని తెలిపాను. ఇప్పటికీ అదే నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను. నాకు నా దేశమే ముఖ్యం. మాతృదేశం కంటే ఏదీ ఎక్కువ కాదు. జై హింద్ అంటూ శిఖర్ ధవన్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఓ పోస్ట్ పెట్టాడు. తాజాగా టీమిండియా మాజీ క్రికెటర్లందరూ ఈ మ్యాచ్ ఆడడంపై విముఖత వ్యక్తం చేయడంతో మ్యాచ్ రద్దయింది.



# పంత్ కు కీలక సూచనలు

రిషబ్ పంత్ కు భారత మాజీ వికెట్ కీపర్ సున్నితంగా ఓ హెచ్చరిక చేశారు. టెస్టు క్రికెట్లో డిసిప్లిన్ బ్యాటింగ్ అవసరమని, రిస్కీ షాట్లను ఐపీఎల్ కోసం దాచుకోవాలని పంత్ కు సూచించాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్ లో పంత్ రాణిస్తున్నాడు. ఇప్పటివరకు మూడు మ్యాచ్ లో 425 రన్స్ చేశాడు. లీడ్స్ లో జరిగిన ఫస్ట్ టెస్టుల్లో రెండు ఇన్నింగ్స్ ల్లో శతకాలు కొట్టాడు. పరిస్థితులు ఎలా ఉన్నా పంత్ ఇంగ్లాండ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగుతున్నాడు. అద్భుతమైన షాట్లు ఆడుతూ వేగంగా పరుగులు రాబడుతున్నాడు. ఈ క్రమంలో కొన్నిసార్లు తక్కువ స్కోరుకే వెనుదిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో పంత్ క్రమశిక్షణతో బ్యాటింగ్ చేయాలని ఫారూక్ ఇంజినీర్ సూచించాడు. కచ్చితంగా పంత్ ఆ రిస్క్ షాట్లను ఐపీఎల్ కోసం దాచుకోవాలి. టెస్టు క్రికెట్లో క్రమశిక్షణతో కూడిన బ్యాటింగ్ అవసరం. మూడు లేదా నాలుగో స్థానంలో వచ్చే బ్యాటర్లు సరైన క్రికెట్ ఆడి పెద్ద స్కోర్లు సాధించి ఇన్నింగ్స్ ను నిర్మించాలని మనందరం ఆశిస్తాం. పంత్ ఒకే టెస్టు రెండు ఇన్నింగ్స్ ల్లోనూ సెంచరీలు చేశాడు. ఇది ఎంతో గొప్ప విషయం. రిషబ్ బలమైన ఇంగ్లాండ్ బౌలింగ్ లైనప్ను సమర్థంగా ఎదుర్కొంటూ పూర్తిస్థాయి బ్యాటర్గా ఆడగలడు. అందుకు అతడు చేసిన పరుగులే నిదర్శనం. కానీ, పంత్ ఊహాలకు అందని వ్యక్తి. అతని మనసులో ఏదనిపిస్తే అది చేసేస్తాడు. ఓసారి షాట్ సెలక్షన్ గురించి అతనితో జోక్ చేశాను. అతను నవ్వుతూ 'ప్రస్తుతానికి ఏది సరైందనిపిస్తే అది చేస్తాను అని చెప్పాడు. పంత్ అపారమైన టాలెంటెడ్. కొత్త కొత్త షాట్లు ఆడతాడు. అతనిలో ఎంతో ఆత్మవిశ్వాసం ఉంది. అయితే, అప్పుడప్పుడు అది లోపిస్తోంది. లంచ్ బ్రేక్ లేదా ఆట ముగింపు వంటి సమయాల్లో పంత్ మరింత బాధ్యతాయుతంగా ఆడాలి అని ఫారూక్ ఇంజినీర్ కోరాడు. లార్డ్స్ టెస్టులో తొలి రోజు వికెట్ కీపింగ్ చేస్తూ పంత్ గాయపడిన సంగతి తెలిసిందే. తర్వాత అతని స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేశాడు. బుధవారం నుంచి మొదలుకానున్న నాలుగో టెస్టులో పంత్ బ్యాటర్గా మాత్రమే బరిలోకి దిగే అవకాశముందని టీన్ఇండియా అసిస్టెంట్ కోచ్ డస్కాటే హింట్ ఇచ్చారు.

# భారీ రికార్డులపై గిల్ స్పెషల్ ఫోకస్



భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇంగ్లాండ్ లో జరుగుతున్న టెస్టు సిరీస్ లో అదరగొడుతున్నాడు. ఇప్పటివరకు అతడు మూడు మ్యాచ్ లో 425 పరుగులు చేశాడు. మిగిలిన రెండు మ్యాచ్ లోనూ పంత్ రాణించాలని అభిమానులు కోరుకుంటున్నారు. జులై 23 నుంచి మాంచెస్టర్లో ప్రారంభం కానున్న నాలుగో టెస్టులో వీరేంద్ర సెహ్వాగ్ నెలకొల్పిన భారీ రికార్డును పంత్ బ్రేక్ చేసే అవకాశముంది. ఈ యంగ్ వికెట్ కీపర్ బ్యాటర్ మరో 3 సిక్సర్లు బాదితే సెహ్వాగ్ ను అధిగమించి టెస్టుల్లో అత్యధిక సిక్స్ లు కొట్టిన భారత బ్యాటర్ గా నిలుస్తాడు. ప్రస్తుతం ఈ జాబితాలో సెహ్వాగ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా రిషభ్ పంత్, రోహిత్ శర్మ కలిసి రెండో స్థానంలో ఉన్నారు. పంత్ ఫామ్ను చూస్తుంటే మాంచెస్టర్ టెస్టులోనే ఈ రికార్డును బ్రేక్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. భారత కెప్టెన్ శుభ్మన్ గిల్ కూడా ఓ రికార్డుకు అతి చేరువలో ఉన్నాడు. అతను మరో 25 పరుగులు చేస్తే ఇంగ్లాండ్ గడ్డపై ఒక టెస్టు సిరీస్ లో అత్యధిక రన్స్ చేసిన ఆసియా బ్యాటర్ గా రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం ఈ ఘనత పాకిస్థాన్ క్రికెటర్ మహ్మద్ యూసుఫ్ పేరిట ఉంది. అతను 2006లో ఇంగ్లాండ్ నాలుగు టెస్టుల్లో 631 పరుగులు చేశాడు. కాగా టీమ్ ఇండియా కెప్టెన్ శుభ్మన్ గిల్ ఇప్పటివరకు ఈ సిరీస్లో మూడు మ్యాచ్లోనే 607 రన్స్ రాబట్టాడు. ఎడ్జ్బస్టన్ టెస్టులో గిల్ ఫస్ట్ ఇన్నింగ్స్లో డబుల్ సెంచరీ చేసిన సంగతి తెలిసిందే.

# క్రికెట్ కోసం చదువు వదిలేసిన ప్లేయర్స్..



ఇండియాలో క్రికెట్ ఆటకు ఎంత క్రేజ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇది ఆట మాత్రమే కాదు, ఎంతో మందికి అభిమానం, మరి కొందరికి జీవన విధానం కూడా. ఇలాంటి ఆట కోసం మన దేశంలో పలువురు క్రికెటర్లు తమ చదువును సైతం వదిలేసి, ప్లేయర్స్ ఎవరో చూద్దాం. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎం.ఎస్. ధోని కామర్స్ కోర్సులో చేరినప్పటికీ, దాన్ని పూర్తి చేయలేకపోయాడు. రైల్వేలో ఉద్యోగం చేస్తున్న సమయంలో క్రికెట్ అతని జీవితాన్ని మార్చేసింది. ధోని నాయకత్వంలో భారత్ 2007 టీ20 ప్రపంచ కప్, 2011 ODI ప్రపంచ కప్‌లను గెలుచుకుంది. నెక్స్ట్ యంగ్ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ 10వ తరగతి తర్వాత చదువును ఆపేశాడు. అతని కుటుంబం అతని క్రికెట్ ట్రైనింగ్ కోసం మొహాలీ మారిపోయింది. ఈ త్యాగం ఫలితంగా, గిల్ ఇప్పుడు భారత క్రికెట్‌లో అత్యంత కీలక ఆటగాడిగా రాణిస్తున్నాడు. ది వాల్‌గా పిలవబడే రాహుల్ ద్రావిడ్ MBA చేసే అవకాశం ఉన్నప్పటికీ, క్రికెట్‌ను ఎంచుకున్నాడు. అతని అంకితభావం, స్థిరత్వం భారత క్రికెట్‌కు ఒక బలమైన స్తంభంగా నిలిచింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా హార్దిక్ పాండ్యా 9వ తరగతి తర్వాత చదువును వదిలేశాడు. ఆ క్రమంలో కుటుంబం అండగా నిలువడంతో అతను క్రికెట్‌పై ఫోకస్ చేశాడు. తర్వాత విరాట్ కోహ్లీ స్కూల్ పూర్తి చేసిన తర్వాత క్రికెట్‌పై పూర్తిగా దృష్టి పెట్టాడు. అతను కఠోర శ్రమతో భారత జట్టులో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌లలో ఒకడిగా నిలిచాడు. ఇక 1983 ప్రపంచ కప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్ కాలేజీ చదువును మధ్యలోనే వదిలేశాడు. క్రికెట్ దేవుడని పిలుచుకునే సచిన్ టెండూల్కర్ 16 ఏళ్ల వయసులోనే చదువును వదిలి భారత జట్టులో చేరాడు. శిఖర్ ధావన్ స్కూల్ పూర్తి చేసిన తర్వాత కాలేజీకి వెళ్లకుండా క్రికెట్‌ను ఎంచుకున్నాడు. అతని దూకుడైన బ్యాటింగ్ శైలి అతన్ని భారత జట్టులో ముందు వరుస ఆటగాడిగా నిలిపింది. ఈ క్రికెటర్లు చదువును వదిలేసినప్పటికీ, వారి కలలను మాత్రం చివరికి సాకారం చేసుకున్నారు.

# పుష్ప తర్వాత వీరమల్లుకే సాధ్యం



ఇటు తెలంగాణలో, అటు ఏపీలో కొత్త ప్రభుత్వాలు ఏర్పాటయ్యాక బెనిఫిట్ షోలు, అదనపు రేట్లకు ఈజీగా అనుమతులు రావడం మొదలైంది. కానీ తెలంగాణలో అంతా సాఫీగా సాగిపోతున్న సమయంలో పుష్ప సినిమా రిలీజ్ సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ లో జరిగిన విషాదంతో ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. బెనిఫిట్ షోలను ప్రభుత్వం నిలిపివేసింది. అదనపు రేట్లకూ అనుమతులు రావట్లేదు. ఏపీలో మాత్రం ఏ సమయంలో బెనిఫిట్ షోలు వేసుకోవాలన్నా, అదనపు రేట్లు కావాలన్నా ఇబ్బంది లేకుండా అనుమతులు వచ్చేస్తున్నాయి. తెలంగాణలో మళ్లీ పూర్వపు పరిస్థితుల కోసం అగ్ర నిర్మాత దిల్ రాజు సహా కొందరు ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం ఉండట్లేదు. ఐతే రాజు వల్ల కానిది ఏఎం రత్నం సాధించేశాడా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. వచ్చే వారం రిలీజ్ కానున్న హరిహర వీరమల్లుకు సంబంధించి లేటెస్ట్ ప్రెస్ మీట్లో రత్నం.. తెలంగాణలోనూ బెనిఫిట్ షోలు వేయడంపై ధీమాగా మాట్లాడారు. హరిహర వీరమల్లు బెనిఫిట్ షోల కోసం అభిమానుల నుంచి బాగా ప్రెజర్ ఉందని.. ఈ సినిమాకు ముందు రోజు రాత్రి రెండు తెలుగు రాష్ట్రాల్లో 9.30కి బెనిఫిట్ షోలు వేయాలని ప్లాన్ చేస్తున్నామని రత్నం తెలిపారు. రెండు రాష్ట్రాల్లోనూ ఈ షోలకు అనుమతులు కూడా వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేయడం విశేషం. తెలంగాణలోనూ ముందు రోజు బెనిఫిట్ షోలు ఉంటాయని రత్నం అంత ధీమాగా చెప్పడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. పుష్ప 2 అనుభవం తర్వాత టాలీవుడ్ నిర్మాతలు బెనిఫిట్ షోలు, అదనపు రేట్ల కోసం ప్రభుత్వానికి అప్లికేషన్లు పెట్టుకోవడానికి కూడా భయపడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఇకపై బెనిఫిట్ షోలు ఉండవని చెప్పేయడంతో నిర్మాతలు ఆశలు వదులుకున్నారు. అందుకే దరఖాస్తులు కూడా పెట్టట్లేదు. ఐతే రత్నం మాత్రం జూన్ 12న సినిమా రిలీజ్ అనుకున్నపుడే ముందుగా వెళ్లి సీఎం రేవంత్‌ను కలిసి వచ్చారు. ఇది పవన్ కళ్యాణ్ సినిమా కావడం, భారీ బడ్జెట్ పెట్టడంతో.. బెనిఫిట్ షోలు, అదనపు రేట్ల కోసం రత్నం చేసిన విజ్ఞప్తికి సీఎం సానుకూలంగా స్పందించారా.. ఇన్నాళ్ల పంతం వదిలి ఈ సినిమాకు షోలు, రేట్ల కోసం అనుమతులు ఇచ్చేస్తారా అనే చర్చ జరుగుతోంది. మరి ఈ విషయంలో టీమ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# ఉస్తాద్ భగత్ సింగ్ లో రాశీఖన్నా



పవన్ కళ్యాణ్ హీరోగా వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో శ్రీలీల ఫస్ట్ హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. లేటెస్ట్ గా ఈ సినిమాకి సెకండ్ హీరోయిన్ గా రాశీ ఖన్నా సెలెక్ట్ అయ్యారు. రీసెంట్ గా తెలుగులో అవకాశాలు తగ్గిన రాశీకి ఇది గోల్డెన్ ఛాన్సేనని చెబుతున్నారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్ లో జరుగుతున్న షూటింగ్‌లో పాల్గొంటున్నారు. పవన్ కళ్యాణ్ తో కలిసి కీలక సన్నివేశాలు ప్లాన్ చేశారు. రాజకీయాల్లో బిజీగా ఉన్నప్పటికీ నిర్మాతల మీద బాధ్యతతో పవన్ డేట్స్ కేటాయించారట. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కానుంది. ఓ వైపు ఏపీ డిప్యూటీ సీఎంగా పదవీ బద్యతలు నిర్వహిస్తూనే అటు సినిమాలతోనూ బిజీగా ఉన్నారు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ . ఆయన నటించిన హరిహర వీరమల్లు మరో నాలుగు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుండగా.. సుజీత్ డైరెక్షన్లో తెరకెక్కిన పీరియాడికల్ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామా ఓజీ సెప్టెంబర్ 25న రిలీజ్ కానుంది. రెండు నెలల తేడాలోనే రెండు సినిమాలతో పవన్ వస్తుండటంతో ఆయన ఫ్యాన్స్ తెగ ఖుషీ అయిపోతున్నారు. ఈ రెండు సినిమాల సంగతి పక్కనబెడితే పవన్ కళ్యాణ్ ప్రస్తుతం హరీష్ శంకర్ డైరెక్షన్ లో ఉస్తాద్ భగత్‌సింగ్ లో నటిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టిన సంగతి తెలిసిందే. అందులో ఆయన పోలీసుగా తనదైన మేనరిజంతో అలరించారు. తాజా సినిమాలోనూ పవన్ పోలీసుగానే కనిపించనుండటంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇక తెలుగులో పెద్దగా అవకాశాలు లేని రాశీకి ఇప్పుడు ఉస్తాద్ లో అవకాశం వచ్చిందంటే.. ఇది గోల్డెన్ ఛాన్సేనని చెప్పాలి. ఇప్పటికే ఆమె సెట్‌లో అడుగుపెట్టింది. ఈ సినిమా షూటింగ్ ప్రజంట్ హైదరాబాద్ లో జరుగుతుండగా పవన్ కళ్యాణ్ తో పాటు ఇతర కాస్టింగ్ పై కీలక సీన్స్ షూట్ చేస్తున్నారు. ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తోన్న ఈ సినిమాని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని పవన్ కంకణం కట్టుకుని మరీ డేట్స్ అడ్జస్ట్ చేశారు. ఓ వైపు రాజకీయాలతో బిజీగా ఉన్నా తనను నమ్ముకున్న నిర్మాతలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉస్తాద్ భగత్‌సింగ్ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఫిష్ వెంకట్ కు రెమ్యునరేషన్ ఎంతంటే..



కామెడీ విలన్ గా తెలుగు ఆడియన్స్ ను నవ్వించిన ఫిష్ వెంకట్ రీసెంట్ గా అనారోగ్య సమస్యలతో మృతి చెందిన విషయం తెల్సిందే. ఆయన మృతి ఇండస్ట్రీలో తీవ్ర విషాదాన్ని నింపింది. తీవ్ర ఆర్థిక సమస్యల కారణంగా ఫిష్ వెంకట్‌కి చికిత్స చేయించలేక చివరకు ఇలా జరిగిందని ఆయన సన్నిహితులు అంటున్నారు. వారి నుంచి సాయం, వీరి నుంచి సాయం.. లక్షల రూపాయలు ఇస్తున్నారంటూ ప్రచారం జరిగింది. కానీ ఏ ఒక్కరి నుంచి కనీసం సహాయం అందలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరి రోజుల్లో తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొన్న ఫిష్ వెంకట్ గతంలో ఎంత సంపాదించారు, ఏం చేశారు అనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. యాక్టర్స్ రెమ్యునరేషన్ అనేది ఈ మధ్య కాలంలో భారీగా పెరిగింది. పది, పదిహేను ఏళ్ల క్రితం యాక్టర్స్ రెమ్యునరేషన్ అనేది చాలా తక్కువగా ఉండేది. ముఖ్యంగా సైడ్ క్యారెక్టర్‌లు వేసే వారికి రోజు వారి పారితోషికం చాలా తక్కువగా ఉండేది. ఇప్పుడు ఉన్నట్లుగా యూనియన్స్ ఎక్కువగా లేవు, అంతే కాకుండా పెద్ద మొత్తంలో పారితోషికం డిమాండ్ చేసే వారు కాదు. ఇప్పుడు మేకింగ్ పెరగడంతో పారితోషికాలు ఎక్కువగా ఇస్తున్నారు. చిన్న పాత్ర చేసిన కమెడియన్స్ సైతం లక్షల రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారు. ప్రొడ్యూసర్స్ కూడా వారికి ఉన్న డిమాండ్ మేరకు అడిగిన మొత్తంను ఇచ్చేందుకు వెనకాడటం లేదు. కానీ ఫిష్ వెంకట్ ఫామ్‌లో ఉన్న సమయంలో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. ఫిష్ వెంకట్ దాదాపుగా 100 సినిమాలు చేశాడు. ఆయన పాత్రల వల్ల హిట్ అయిన సినిమాలు ఉన్నాయి, సినిమాలకు ఆయన కామెడీ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిన సందర్భాలు ఉన్నాయి. నటుడు జయప్రకాష్ రెడ్డి తో కలిసి ఫిష్ వెంకట్ చేసిన కామెడీ సీన్స్ కి మంచి రెస్పాన్స్ వచ్చేది. మొదట్లో విలన్‌గా నటించినప్పటికీ కామెడీ యాంగిల్ కారణంగా కామెడీ విలన్ గా ఎక్కువ సినిమాలు చేశాడు. విలన్ గ్రూప్‌లో ఎక్కువగా ఫిష్ వెంకట్ కనిపిస్తూ ఉండేవాడు. ఆయన ఎంతో మంది స్టార్ హీరోల సినిమాల్లో నటించేవాడు. ఒకానొక సమయంలో వరుస ఆఫర్లు దక్కించుకున్నాడు. స్టార్ హీరోల సినిమాల్లో ఖచ్చితంగా ఫిష్ వెంకట్ ఉండేవాడు. అలాంటి సమయంలో ఫిష్ వెంకట్ రోజుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల పారితోషికం తీసుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కెరీర్ స్టార్టింగ్ లో వందల రూపాయల పారితోషికం తీసుకుని సినిమాలు చేసిన ఫిష్ వెంకట్ 30 నుంచి 40 సినిమాల తర్వాత వేల రూపాయలు పారితోషికం తీసుకోవడం మొదలు పెట్టాడని, అప్పుడప్పుడే డబ్బులు సంపాదిస్తున్నాడు అనుకున్న సమయంలో షుగర్ కారణంగా కాలుకు గాయం కావడంతో సినిమాలు చేయలేక పోయాడు. తిరిగి సినిమాల్లో నటించాలని అనుకున్నప్పటికీ ఆయన ఆరోగ్యం సెట్ కాలేదు. చాలా సినిమాలకు అయిదు నుంచి పది రోజుల పాటు షూటింగ్‌లో పాల్గొనేవాడు. అప్పుడు ఆయన తీసుకున్న పారితోషికం ఎక్కువే అయినా అనారోగ్య పరిస్థితులు, ఇతర మెయింటెన్స్ కారణంగా ఉన్న డబ్బు అంతా ఖర్చు అయిందట. దాంతో ఆర్థిక ఇబ్బందులు మొదలు అయ్యాయి. అందుకే ఇప్పుడు నటులు చాలా ముందు చూపుతో వచ్చిన మొత్తంలో ఎక్కువ సేవింగ్స్ కి వినియోగిస్తున్నారట. ఫిష్ వెంకట్ పరిస్థితి చూసిన వారు ఇప్పటి నుంచైనా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. కాగా ఫిష్ వెంకట్ మృతిపై ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

# సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కు కోటి రూపాయలు



నాటు నాటు సాంగ్ తో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యాడు సింగర్ రాహుల్ సిప్లిగంజ్. ఆ ఒక్క పాటతో ఎంతో మంది అభిమానుల్ని సంపాదించుకున్నాడు. తన అద్భుతమైన గొంతుతో తెలుగులో పాటలు పాడుతూ ఆడియన్స్ మనసులు గెలుచుకున్నాడు. ఇపుడీ ఈ తెలంగాణ గొంతుకకి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార కోటి రూపాయలు నజరానా ప్రకటించింది. తాజాగా జరిగిన పాతబస్తీ బోనాల సందర్భంగా రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి ప్రోత్సాహక బహుమతిని అందజేయడానికి ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాహుల్ స్వయంకృషితో.. ఓపక్క సింగర్ గా కంటిన్యూ అవుతూనే.. మరో పక్క ప్రైవేట్ ఆల్బమ్స్ చేస్తూ యూత్ లో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. ఇలా హైదరాబాద్ నుంచి ఆస్కార్ స్థాయికి ఎదిగిన సింగర్ రాహుల్ యువతకు ఆదర్శమని ప్రశంసించారు. 2023లోనే ఓ ప్రోగ్రాంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆస్కార్ గెలుచుకున్న రాహుల్ సిప్లిగంజ్ కు రూ.10 లక్షలు నగదు ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కోటి రూపాయల నగదు ఇస్తామని చెప్పారు. ఆర్టిస్టులను సన్మానించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆనాడు రేవంత్ చెప్పినట్టుగానే తాజాగా సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కు కోటి రూపాయలను బహుమతిగా ప్రకటించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రీసెంట్ గా జరిగిన గద్దర్ అవార్డుల వేడుకలోనే రాహుల్ సిప్లిగంజ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అవార్డు ఇవ్వకపోయినా ఏదో ఒకటి ఇవ్వాలని సీఎం చెప్పగా.. దానికి డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క తల ఊపుతూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కాగా బోనాల సందర్భంగా రాహుల్ కు కోటి రూపాయల బహుమతి ప్రకటించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు సీఎం రేవంత్ రెడ్డి. కాగా ప్రజంట్ రాహుల్ సిప్లిగంజ్ పేరు సోషల్ మీడియాతో పాటు టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మార్మోగిపోతుంది. అంతేకాకుండా రాహుల్ కు ఈ నజరానా ప్రకటించడంతో టాలీవుడ్ సినీ ఇండస్ట్రీ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# థియేటర్ లో స్నాక్స్ రేట్ల పై నిఖిల్ ఫైర్..

ఒకప్పటితో పోలిస్తే, ఇప్పుడు ఓ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ థియేటర్ లో సినిమా చూడడం చాలా కాస్ట్ అయిపోయింది. దేశవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్లు, మల్టీప్లెక్స్ లలో సినిమా టికెట్ల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇక పెద్ద స్టార్ సినిమా రిలీజ్ అయ్యిందంటే చాలు టికెట్ పై మరింత ఎక్కువ ధర వడ్డిస్తారు. దీంతో మధ్య తరగతి వ్యక్తులు థియేటర్లకు రావాలంటే ఖర్చుకు భయపడిపోతున్నారు. ఇక ఎలాగోలా టికెట్ కొనుక్కొని లోపలికి వెళ్తే, అక్కడ స్నాక్స్ పేరిట మరో దోపిడి జరుగుతుంది. ఏది కొందామన్నా ధరలు భగ్గుమంటాయి. మనం తీసుకెళ్లేది లోపలికి అనుమతించరు. లోపల దొరికేవి మనం కొనుక్కోలేం. అయినా కాస్త ధైర్యం చేసి ముందడుగు వేస్తే నలుగురున్న ఫ్యామిలీ ఏదో టైమ్ పాస్ కోసం తినే స్నాక్స్ కు వెయ్యికి పైనే ఖర్చుతుంది. ఒక విధంగా చూసుకుంటే సినిమా టికెట్ ధర కంటే, థియేటర్ లోపల పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ కే ఎక్కువగా ఖర్చు అవుతోంది. ప్రేక్షకులు ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య ఇదే. ఫలితంగా ఇది సినిమా బాక్సాఫీస్ కలెక్షన్ లను సైతం ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోంది. అయినా పట్టించుకునేవారేరీ? అయితే టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ థియేటర్ స్నాక్స్ ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఓవైపు సినిమా టికెట్ రేట్లు గురించి మాట్లాడుతూనే, పాప్ కార్న్ కూల్ డ్రింక్స్ ధరలపై స్పందించారు. ఈ సమస్యపై దృష్టి పెట్టాలని సంబంధిత సంస్థలను కోరారు. టికెట్ ధరను పరిమితం చేయాలి. కానీ థియేటర్ లోపల పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ ధరలు విపరీతంగా ఉన్నాయి. నేను రీసెంట్ గా ఒక థియేటర్ లో సినిమా చూశాను. అయితే సినిమా టికెట్ కంటే స్నాక్స్ కే నేను ఎక్కువ డబ్బులు ఖర్చు చేశాను. ఇది నన్ను షాక్ కు గురి చేసింది. దయచేసి దీనిపై దృష్టి పెట్టాలని డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు రిక్వెస్ట్ చేస్తున్నా అని నిఖిల్ సోషల్ మీడియా ఖాతా ఎక్స్ లో పోస్ట్ షేర్ చేశారు.